# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

సంపుటి : 45 సంచిక : 23, 24 విజయవాడ 20-4-2013 పేజీలు : 8 వెల : రు 5.00

www.janashaktionline.com


**లోపలి పేజీల్లో...**


- కొండమొదలు గిరిజన రైతాంగ సమస్యలపై ముఖ్యమంత్రికి కా॥ఎమ్మార్ బహిరంగ లేఖ
- గిరిజనోద్యమానికి అండగా నిలచిన కా॥మానం రామారావు
- ప్రతిఏటా వరద బీభత్సానికి గురయ్యే బాపట్ల తాలూకా రైతాంగ దుర్భర స్థితిపై కా॥ఎమ్మార్ క్షేత్రస్థాయి పరిశీలన
- పొగాకు గిట్టుబాటు ధరల సమస్యపై కా॥ఎమ్మార్ నిశిత అధ్యయనంలో రూపొందించిన కరపత్రం
- భూములు ఇళ్ళస్థలాలకోసం కొనసాగుతున్న పిడుగురాళ్ళ పేదల పోరాటానికి కా॥ఎమ్మార్ సంఘీభావం


## నిబద్ధ కమ్యూనిస్టు, రైతు-కూలీ పోరాట యోధుడు, సిపిఐ(ఎం-ఎల్) సీనియర్ నాయకుడు

# కామ్రేడ్ మానం రామారావుకు రాష్ట్రకమిటి విప్లవజోహార్లు

**గుంటూరుజిల్లా** - బాపట్ల తాలూకా - నర్సాయపాలెం గ్రామంలో 1920లో జన్మించిన కామ్రేడ్ మానం రామారావు - నిబద్ధత గల కమ్యూనిస్టుగా, రైతుకూలీ పోరాట యోధునిగా, కమ్యూనిస్టు విప్లవకారునిగా, సిపిఐ(ఎం-ఎల్) నాయకునిగా బాధ్యతలు నిర్వర్తించి, 93 సం॥ల వృద్ధాప్యంలో విజయవాడలో 2013 మార్చి 16న అమరులయ్యారు. కామ్రేడ్ మానం రామారావుకు సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్రకమిటి అరుణారుణ జోహార్లు చెబుతోంది.



**కమ్యూనిస్టు కార్యకర్తగా... తొలిదశలో....**

కామ్రేడ్ మానం రామారావు (ఎమ్మార్) మధ్యతరగతి రైతు కుటుంబంలో పుట్టి, యువకునిగా వున్నపుడు గ్రామంలో కమ్యూనిస్టు భావాలతో ఉత్తేజితులయ్యారు. తనతో సహా నిరక్షరాస్యులైన యువజనుల విద్య, వికాసాల అభివృద్ధికి పార్టీ ఆధ్వర్యంలో రాత్రి పాఠశాలలు, వయోజన పాఠశాలలు నిర్వహించారు. వ్యవసాయపనులు చేసుకుంటూ, వెసులుబాటు సమయంలో గ్రామ పొలిమేరల్లో ఇసుకనేలపై అక్షరాలు దిద్దిన కామ్రేడ్ ఎమ్మార్, పట్టుదలతో శ్రమించి అనతికాలంలోనే పార్టీ సాహిత్యాన్ని అధ్యయనం చేసే స్థాయికి ఎదిగారు. అప్పటికే 6-7 తరగతులు చదువుకున్న వసంతమ్మగారితో వివాహానంతరం ఆమె ద్వారా కరపత్రాలు, దినపత్రికలు చదివించుకునేవారు. అదేవిధంగా ఆమెను పార్టీ మరియు సంఘ కార్యకలాపాలలో పాల్గొనే విధంగా ప్రోత్సహించారు. గ్రామంలో మంచి యువకుల బృందాన్ని కూడగట్టి, వారి ద్వారా మొత్తం గ్రామాన్ని విజ్ఞానవంతం చేశారు. పీడితవర్గాలను చైతన్యవంతులను చేసి పెత్తందార్లకు వ్యతిరేకంగా సంఘటితం చేశారు; యువజన, పాలేర్ల సంఘాలను నిర్మించారు. నర్సాయపాలెం గ్రామాన్ని స్టాలిన్‌గ్రాడ్ అని కమ్యూనిస్టులు, కమ్యునిస్టేతరులు అనుకునేట్లుగా కమ్యూనిస్టు భావజాలంతో గ్రామ ప్రజలను సంఘటితపరిచారు.

**నిరంతర ఆందోళనకారునిగా...**

సామాజిక ప్రగతికి, వర్గ పోరాటానికి అంకితంకావాలనే నిర్ణయం తీసుకున్న కామ్రేడ్ ఎమ్మార్, నిరంతర ఆందోళనకారుడిగా ప్రజలకు నాయకత్వం వహించారు. నాటి వలసపాలకులు ఇనుము వాడకంపై నిషేధం విధించగా, వ్యవసాయానికి అవసరమైన బండిపట్టాలు; ప్రజలకు బట్టలు... తదితర అవసరాల కోసం బ్రిటీష్ అధికార యంత్రాంగంపై ఆందోళనలకు నాయకత్వం వహించారు. కమ్యూనిస్టుపార్టీ పిలుపుమేరకు ఒక ఉద్యమంగా నడిచిన ఆహారోత్పత్తి పెంపుదలకు కృష్ణా కాలవల పూడికతీత పనులను యువకులందరితో కలసి నిర్వహించారు. 1947లో - తెలంగాణా రైతాంగపోరాటానికి సంఘీభావంగా ఆ ప్రాంత కార్యకర్తలకు అవసరమైన ఆర్థిక, పాదార్థిక సహకారాన్ని పోగుచేయటం; 'మా భూమి' తదితర భూస్వామ్య వ్యతిరేక నాటకాలు వేయించటం... దీక్షతో, ఒక ముఖ్య కర్తవ్యంగా చేపట్టి నిర్వహించారు. తెలంగాణా రైతాంగ పోరాటాలు సాగిస్తున్న మిలిటెంట్ దళాలకు ఆయుధ శిక్షణ నిప్పించటంలోనూ; వారికి రక్షణ ఏర్పాట్లు చేయటంలోనూ పార్టీ నాయకత్వంలో మంచి కృషిచేశారు.

1952-54 కాలంలో వేలాది ఎకరాల రొంపేరు బంజరును పీడితకులాలకు, పేద ప్రజలకు పంపిణీకై దీర్ఘకాల ఉద్యమం సాగించి విజయం సాధించారు. ఇదేకాలంలో కృష్ణానదీ జలాలను పర్చూరు, పెదనందిపాడు ప్రాంతప్రజల సాగు, తాగునీటి అవసరాలకు అందించాలని ఆందోళన సాగించారు. పర్చూరు తాలూకాలో వ్యవసాయదారుల, కూలీల సమస్యలపై ఆందోళనలు; పొగాకు రైతులకు ఐటిసి కంపెనీ గిట్టుబాటు ధర ఇవ్వాలనే డిమాండ్లపై ఆందోళనలు సాగించారు. 1979లో ప్రకాశంజిల్లాలో వరదబాధితులకు-ముఖ్యంగా జరుగుమిల్లి, టంగుటూరు మండలాల్లో సహాయ కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టారు. 1981లో కారంచేడులోనూ; 1983లో టంగుటూరులోనూ పొగాకురైతులపై కాల్పులను ఖండిస్తూ రైతులను కూడగట్టి ఆందోళన సాగించారు.

**భూస్వామ్య పెత్తందార్లకు కంటగింపుగా...**

కమ్యూనిస్టుపార్టీ నాయకత్వంలో అట్టడుగు పీడిత, దళిత ప్రజానీకపు భూమి, సాంఘిక వివక్షల వంటి సమస్యలపై నిరంతర పోరాటాలు సాగించిన కామ్రేడ్ ఎమ్మార్, స్థానిక పెత్తందార్లకు కంటగింపయ్యారు. గ్రామ ఉమ్మడి చెరువులో దళితుల ప్రవేశాన్ని నిరోధిస్తున్న పెత్తందార్ల దౌర్జన్యాలను, దళితులను సమీకరించి ఆయన అడుగడుగునా ప్రతిఘటించారు.

గ్రామ పెత్తందార్లతో తీవ్ర సంఘర్షణల నడుమే 1953లో పీడితప్రజల అండతో కామ్రేడ్ ఎమ్మార్ నర్సాయపాలెం గ్రామసర్పంచ్‌గా ఎన్నికయ్యారు. అప్పటివరకూ దళితులను 'అరే... ఒసే...' అంటూ తుస్కారంగా పిలుస్తూవస్తున్న పెత్తందార్లను, 'తిరిగి దళితులందరూ అదేవిధంగా మిమ్ములను పిలిస్తే మీ అహం ఏమౌతుందో చూసుకోండ'ని హెచ్చరించారు. ఒక్కరోజైనా ఆ విధంగా పిలవమని దళితులను ప్రోత్సహించారు. ఈరకపు చర్యలతో బెంబేలెత్తిన ఆ ప్రాంత పెత్తందారులు కాంగ్రెస్ నాయకుడు నీలం సంజీవరెడ్డికి మొరపెట్టుకుని పంచాయితీ రద్దు చేయించి, కామ్రేడ్ ఎమ్మార్‌ను సర్పంచి పదవి నుండి అర్ధాంతరంగా తొలగించినప్పటికీ, పట్టుదలతో ఆయన తన కార్యకలాపాలలో నిమగ్నమయ్యారు.

1969లో నాటి గుంటూరుజిల్లాలోని ఇంకొల్లు - భీమవరం లోనూ... 1985లో కారంచేడులోనూ... దళితులపై అగ్రకుల భూస్వామ్యవర్గాలు సాగించిన హత్యాకాండలపై కామ్రేడ్ ఎమ్మార్ తీవ్రంగా స్పందించారు. వెనువెంటనే ఆయా ప్రాంతాలకు వెళ్ళి వివరాలు సేకరించుకొచ్చి, దళితులపై హంతకదాడులను ఖండిస్తూ కరపత్రాలు ముద్రించి, భూస్వామ్య, పెత్తందార్ల దౌర్జన్యాలను, అగ్రకుల దురహంకారాన్ని వెల్లడిచేయటంతోపాటు, బాధిత దళితులకు సంఘీభావాన్ని కూడగట్టటంలోనూ, వారిని పోరాటంలోకి సమీకరించటంలోనూ కామ్రేడ్ ఎమ్మార్ విస్తృత కృషిచేశారు.

**పార్టీ-రైతు,కూలీ ఉద్యమ నిర్మాణాలలో...**

1942లో యువకునిగా కమ్యూనిస్టుపార్టీ సభ్యత్వం స్వీకరించిన కామ్రేడ్ ఎమ్మార్, 1946-47నాటికి బాపట్ల తాలూకా కమిటీ సభ్యునిగా ఎన్నికయ్యారు. 1953 నుండి సాగిన పార్టీ ఆంతరంగిక పోరాటంలో చురుకుగా పాల్గొన్నారు. సి.పి.ఎం ఏర్పడినపుడు 1964లో బాపట్ల తాలూకా కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఆపై సిపిఎం లోపల జరిగిన సంఘర్షణలో విప్లవ ప్రజాయుద్ధ పంథాను సమున్నతంగా ఎత్తిపట్టారు. అతి, మితవాదాలను; సెక్టేరియన్ విధానాలను తీవ్రంగా వ్యతిరేకించారు. 1968లో గుంటూరుజిల్లా విప్లవ కమ్యూనిస్టు కమిటీ నాయకత్వ బాధ్యతలు చేపట్టారు. కామ్రేడ్ నాగిరెడ్డి విప్లవ రాజకీయాలపట్ల అచంచల విశ్వాసంతో, పార్టీ నిర్మాణంలో ఎదురైన పెదధోరణులన్నింటినీ ఎదుర్కొంటూ అమరులయ్యే నాటికి కామ్రేడ్ విశ్వం నాయకత్వంలోని సిపిఐ(ఎం-ఎల్) సీనియర్ నాయకునిగా వున్నారు. 1980 నుండీ దాదాపు రెండు దశాబ్దాలు పార్టీ రాష్ట్రకమిటి సభ్యునిగా కొనసాగారు.

1986లో ఏర్పడిన రైతుకూలీ పేదల సంఘం వ్యవస్థాపక అధ్యక్షునిగా కామ్రేడ్ ఎమ్మెస్‌తో కలిసి బాధ్యతలు పంచుకున్నారు. విప్లవసంఘాల విలీనం తర్వాత రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కొనసాగారు.

కామ్రేడ్ నాగిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పడిన పార్వతీపురం కుట్రకేసు డిఫెన్స్ కమిటీ నిధుల సేకరణకు కామ్రేడ్ ఎమ్మార్ కృషిచేశారు. ఎమర్జెన్సీ తదనంతరం రాష్ట్రవ్యాపితంగా-ప్రత్యేకించి గుంటూరుజిల్లాలో ప్రజలపై ప్రభుత్వ నిర్బంధానికి వ్యతిరేకంగా పౌర, ప్రజాస్వామిక హక్కుల ఉద్యమనిర్మాణ కృషిలో చురుకైన పాత్ర నిర్వహించారు.

'తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్' సంస్థాపకుల్లో ఒకరుగా కామ్రేడ్ ఎమ్మార్ కృషి సాగించారు. కామ్రేడ్ టి.ఎన్. విఖ్యాత రచన 'తాకట్టులో భారతదేశాన్ని' రాష్ట్రంలోని భిన్న రాజకీయశక్తుల మధ్యకు తీసుకెళ్ళటంలో కాలికి బలపం కట్టుకుని తిరిగారు; విస్తృతంగా కృషిచేశారు. విప్లవ కమ్యూనిస్టుల పక్షపత్రిక 'జనశక్తి'కి సంపాదకుని హోదాలో బాధ్యత వహించారు.

**నిర్బంధం... అరెస్టులు....జైలు... రహస్యజీవితం.....**

బి.టి.రణదివే కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శిగానున్న కాలంలో - 1948 ఫిబ్రవరి తర్వాత - రాష్ట్రవ్యాపితంగా పార్టీ కార్యకర్తలపై తీవ్రనిర్బంధం కొనసాగింది. ఈ క్రమంలో కామ్రేడ్ ఎమ్మార్, వసంతమ్మగారితో కలసి ఉద్యమ నిర్మాణ అవసరాలరీత్యా రహస్యంగా వుండి పనిచేశారు. మారువేషాలతో పోలీసుల కళ్ళుగప్పి తప్పించుకున్నా, ఎట్టకేలకు స్మశానంలో తలదాచుకున్న విషయాన్ని భూస్వాముల 'గ్రామ రక్షకదళం' పసిగట్టి, కామ్రేడ్ ఎమ్మార్‌ను చుట్టుముట్టి బంధించి ఆయననూ, ఆయనతోపాటు వసంతమ్మగారినీ పోలీసులకు అప్పగించారు. 'కన్పిస్తే కాల్చివేత' (షూట్ ఎట్ సైట్) ఆదేశాలున్నాయని తెలిసీ, తాను కమ్యూనిస్టుపార్టీ సభ్యుడినే అయినా, తనకు ఏ రహస్యాలూ తెలియవని, నిర్భయంగా తెగేసి చెప్పారు.

1952లో పార్టీపై నిర్బంధాన్ని ఎదుర్కొంటూనే బాపట్ల, పొన్నూరు, పర్చూరు తదితర శాసనసభా నియోజకవర్గాల పరిధిలో విస్తృత ఎన్నికల సన్నాహక కృషి చేశారు. సిపిఎంపై తీవ్ర నిర్బంధం కొనసాగిన కాలంలో 1964 డిసెంబరు నుండి 1966 ఏప్రియల్ వరకు 16మాసాలపాటు రహస్యంగా ప్రజల మధ్య వుండి పనిచేశారు. 1968లో నాగిరెడ్డి కుట్రకేసులో నిందితునిగా ప్రభుత్వం నమోదు చేయటంతోనూ; 1975 అత్యవసరపరిస్థితి కాలంలోనూ పోలీసు నిర్బంధం కారణంగా **(తరువాయి 2వ పేజీలో)**

# కొండమొదలు గిరిజన రైతాంగ సమస్యలపై
# ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ యన్.టి.రామారావుగారికి బహిరంగలేఖ

**ఆర్యా!**

9-1-84న తెలుగుదేశ ప్రభుత్వం ప్రథమ వార్షికోత్సవ సదస్సులో నందమూరి తన ఉపన్యాసంలో 'దేవుడిచ్చిన భూమికి శిస్తు ఏమిటి రైతన్నా? నీ ఆశలన్నీ ఫలింపజేస్తూ ప్రకటిస్తున్నాను నేను, ఈ సభాముఖంగా వలస రాజ్యాధికార వారసత్వంగా మిగిలివున్న శిస్తు విధానం రద్దు' అని గర్జించిన నందమూరికి కొన్ని వాస్తవాలు గుర్తుకు రావటానికి ఈ బహిరంగ లేఖ రాస్తున్నాను.

ప్రకృతి సహజమైన ఈ భూదేవి కొద్దిమంది భూస్వాముల చేతుల్లో వుండుటకు గల కారణం ఏమిటి?

అల్లూరి సీతారామరాజు నాయకత్వాన చరిత్రాత్మకమైన పోరాటం సాగిన మన్య ప్రాంతంలోని కొండమొదలు గిరిజనులు తమ జన్మహక్కైన భూమి హక్కుకోసం పోరాడుతున్నారు. తమ పంటలను కాపాడుకొంటున్న గిరిజనులపై కిరాయి కాంగ్రేసు ప్రభుత్వం కాల్పులు జరిపి ఇద్దరు గిరిజనులను పొట్టన పెట్టుకొంది. మీరు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన పదిరోజులకు 19-1-83న మా పార్టీ యు.సి.సి.ఆర్.ఐ(ఎం.ఎల్) తరఫున నేను మిమ్ములను స్వయంగా కలిసి అన్ని వివరములతో మెమోరాండం ఇచ్చాను. 25 నిమిషాలసేపు ఆ విషయంపై మీకు వివరించాను.

దేశంలో సుమారు 5 కోట్లుగా వున్న గిరిజనులు -అందులో ఆంధ్రప్రదేశ్‌లోని 30 లక్షలకు పైగా కొండ కోనల్లో, అడవిలో పుట్టి పెరిగి బయట ప్రపంచముతో సంబంధములేని గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని మైదాన ప్రాంతాల భూస్వాములు వారి భూముల్ని కాజేస్తున్నారు.

ఇందులో భాగంగానే కొండమొదలులో కీ.శే. శివయ్య పాత్రుడు (అమరుడు కా॥తరిమెల నాగిరెడ్డి, నాలాంటి 64 మందిపై పెట్టిన కుట్రకేసులో ప్రాసిక్యూషన్ సాక్షి) పోతుల శాయన్న పంతులు (కరణం), వులవల నారాయణ, బెజవాడ బుల్లెబ్బాయ్-ఈ నల్గురు, తదితరులు అక్రమంగా గిరిజనుల భూముల్ని కాజేశారు. వీరికి తమ తమ సొంత గ్రామాల్లో సారవంతమైన భూములు, కొండమొదలు ప్రక్కనే వున్న పోలవరం తాలూకాలో వ్యాపారాలు, సినిమా హాలు, ఆధునికమైన ఇళ్ళు వున్నాయి. ఇప్పటికే భూసంస్కరణ పరిధిలోనికి వచ్చిన ఈ నలుగురికి ఈ భూములపై ఎలాంటి హక్కూ వుండటానికి వీలులేదు.

1954వ సంవత్సరం కర్నూలు అసెంబ్లీలో బంజరుభూమి పేదలకే యివ్వాలని చేసిన ఏకగ్రీవ తీర్మానాన్ని మీ ప్రభుత్వం, అధికారులు చెత్తబుట్టలో పారేశారా? ఈ చట్ట ప్రకారం కూడా ఈ నలుగురికి ఎలాంటి హక్కూ లేదు.

బ్రిటిష్ వాడి "వలస రాజ్యాధికారంలో" 1917 సంవత్సర 'ఏజన్సీ ఇంటరెస్టు అండ్ లాండ్ ట్రాన్స్‌ఫర్ రెగ్యులేషన్' యాక్టు ప్రకారం గిరిజనుల భూములు గిరిజనేతరులు కొనకూడదు. అయినా 37 సంవత్సరాల దేశీయుల పాలనలో ఈ చట్టం ఎందుకు అమలు జరగటంలేదు?

1959 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు ఏరియాస్ లాండ్ ట్రాన్స్‌ఫర్ రెగ్యులేషన్ యాక్టు 25 సంవత్సరాల క్రితం పెట్టినా ఈ చట్టం 37 సంవత్సరాల 'స్వతంత్ర' పరిపాలనలో, మీ రామరాజ్యంలో ఎందుకు అమలు జరిపించుట లేదు?

1979లో జారీచేసిన ఆర్డరు చెల్లనేరదని హైకోర్టులో జస్టిస్ జీవన్‌రెడ్డి తీర్పు ఇచ్చారు. అయినా మీ హయాంలోనే ఆగస్టులో కోర్టు కొట్టివేసిన ఈ ఆర్డరును నవంబరులో అమలు జరపటానికి మీ అధికార యంత్రమూ, పోలీసు బలగాలు ఎందుకు పూనుకున్నట్లు? ట్రైబల్ కోర్టులు, ట్రిబ్యునల్స్, గిరిజనాభివృద్ధి కార్పొరేషన్, భూసంస్కరణల చట్టాన్ని ప్రభుత్వం, అధికారులు చెత్తబుట్టలో వేశారా?

స్థానిక ఎం.ఎల్.ఏ. తెలుగు దేశపు ప్రభుత్వ ప్రతినిధి శ్రీ జోగారావు 10-5-83న కొండమొదలు గిరిజనుల సమక్షంలో గత కాంగ్రెసు ప్రభుత్వంలో లాగా అన్న ఎన్.టి.రామారావు గిరిజనులను కాల్చి చంపుటకు కాదు గద్దెనెక్కింది! గిరిజనుల, బడుగు వర్గాల హక్కుల్ని రక్షించుటకు పూనుకున్నాడని, మీ విషయాలు అన్న దృష్టికి తెచ్చి, మీ భూముల్ని మీకు వచ్చేటట్లు చేస్తాన'ని వాగ్దానం చేశాడు. ఆ వాగ్దానం కొండమొదలు కొండల్లో, గోదావరి వరదల్లోను మునిగిపోయిందా?

ముఖ్యమంత్రిగా మీకు 19-1-83న వివరించినట్లుగా 6-2-83న తూర్పుగోదావరిజిల్లా కలెక్టరుగారికి, ఎస్.పి.గార్లను స్వయంగా కలిసి గంటసేపు కొండమొదలు గిరిజనులపై కాల్పులు, ఇద్దరు గిరిజనులను చంపినదీ, వారి జన్మహక్కైన ఈ భూమి విషయంలో గిరిజనులకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించుట జరిగినది. అడంగుల రికార్డుల ప్రకారం ఈ భూమి సమస్యను పరిష్కరించాలని కోరటం జరిగింది. అయినా ఈ విషయం పట్టించుకున్న నాథుడే లేడు. పైగా గిరిజనులపై అక్రమంగా కేసులు పెట్టారు.

6-8-83న జిల్లాకలెక్టరు గారికి, ఛీఫ్ సెక్రటరీగారికి, మీకు మొత్తం కొండమొదలు భూమి సమస్యను వివరంగా రిజిస్టరు పోస్టులో పంపుట జరిగినది. కాని మీ ప్రభుత్వం ప్రజల సమస్యలు అర్థంచేసుకొనుటకు అని "చైతన్య యాత్రలు" జరిపారు. అనేకసార్లు మేము పంపిన, మీతో మాట్లాడిన, రిజిస్టరు పోస్టులో పంపిన సమాచారం యావత్తూ మీకు, మీ ఎమ్.ఎల్.ఎ.కు, ప్రభుత్వ అధికారులకు కనుమరుగయిపోయిందా? అయితే మీ చైతన్య యాత్రల స్వభావం ఏమిటి? మీ దేవుడిచ్చిన భూమి నినాదం నాటకంగానే మిగిలిపోలేదా?

"ముఖ్యమంత్రిగా మీరు 4-7-83న అల్లూరి సీతారామరాజు 86వ జయంతి రోజున మన్యం ప్రజలు, గిరిజనులు నేటికీ దయనీయమైన బ్రతుకులు ఈడుస్తున్నారనీ, ఆటవిక జాతుల గురించి మన్య ప్రాంతాలకు వెళితే తెలుస్తుంది అనీ అన్నారు. అల్లూరి సీతారామరాజుని "బందిపోటు దొంగ" అన్నారంటూ ఆవేశంగా, ఆవేదనతో మాట్లాడారు. కాని ఆశ్చర్యం ఏమిటంటే మానవత్వం ఉన్న వారందరికీ ఆందోళన కలిగేటట్లుగా ఆ జిల్లా అధికారులు ఏం జేశారో చూడండి.

23-11-83న జిల్లా కలెక్టరు, పోలీసు అధికారులు పోలీసు బలగంతో కొండమొదలు వెళ్లి ప్రజలను రాజీకని పిలిపించి, పోలీసులు సాయుధంగా వలయాకారంలో చుట్టుముట్టి దమన నీతితో గిరిజనులను నొక్కిపట్టి ఏకపక్షంగా ఒక ఒప్పందం రాసుకొని బలవంతంగా ఆ కాయితాల మీద సంతకాలు చేయించుకొని వెళ్ళారు.

చట్టప్రకారమే అయినా భూములపై ఎలాంటి హక్కూలేని భూస్వాములకు ఈ ఒప్పందం పేరుతో భూమిపై వారికి లేని హక్కును కల్పించడానికి మీరు అనుసరించిన పద్ధతి కుట్రపూరితం కాదా?

భూముల విషయం అడుగుతున్న గిరిజనుల మాట పట్టించుకోకుండా "బెటాలియన్ల"ను దించి, మిమ్ములను సర్వనాశనం చేయడం పెద్దకష్టం కాదని బెదిరించి ఆ ఒప్పంద పత్రం గిరిజనులకు ఇవ్వకుండా పోవడం పచ్చిదగా కాదా? మోసం కాదా? దమన నీతితో వంచించడం కాదా? చివరగా... 43 సంవత్సరాల రాజకీయ జీవితంలో 37 సం॥రాల "దేశీయుల పరిపాలన"లో మంత్రి వర్గాలు తరచుగా మారుతూ వుండటం, ఇలా మారుతున్న మంత్రులు వారి బుద్ధికి తోచినట్లు కట్టలకొద్దీ చట్టాలు చేస్తూనే వున్నారు. కాని వాటి అమలుకు మాత్రం పూనుకొనుట లేదు. గిరిజనుడు పుట్టి పెరిగిన మన్య భూమి చట్టపరంగానూ న్యాయంగానూ వారికే "దేవుడిచ్చిన భూమి".

గిరిజనులకు చెందాలని వున్నా లంచగొండి అధికారుల చేతులలో డబ్బు, పలుకుబడి వున్న వారికే చట్టాలు ఉపయోగపడేలా చూస్తున్నారు అనేది వాస్తవం.

1917 రెగ్యులేషన్ యాక్టు, 1954లో కర్నూలు అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం, 1959 ఆంధ్రప్రదేశ్ గవర్నమెంటు యాక్టు, 1979లోని ఆర్డరుపై జీవన్ రెడ్డి ఇచ్చిన తీర్పు వగైరాలను తెలుగుదేశపు ప్రభుత్వ పాలనలో అధికారులు లెక్కచేయటం లేదు. మరీ బరితెగించి హైకోర్టు నిర్ణయాలను, చట్టాలను కూడా తుంగలో త్రొక్కి వేస్తున్నారు.

మధ్యప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలోని షెడ్యూల్డ్ తెగల ప్రాంతంలో భూమిని గిరిజనులకు ఇచ్చే విషయంలో ఇంజెక్షన్‌గాని, స్టే ఉత్తర్వుగాని సివిల్ కోర్టులో ఇవ్వకుండా నిరోధించింది. ఒక ఆదివాసి భూమికి వ్యతిరేకంగా ఏ సివిల్ కోర్టు ఇంజెక్షన్, స్టే ఉత్తర్వులను ఇవ్వబోమని ప్రభుత్వం ఒక నోటిఫికేషన్‌లో తెలిపింది. (13-1-84)

ఒక సంవత్సరంలో ప్రజా వ్యతిరేకమైన అనేక ఆర్డినెన్స్‌లు పెట్టిన తమరు అల్లూరికి వారసుడిగా మాట్లాడి ఎన్నికలలో "గిరిజనుల సంక్షేమం, అభ్యున్నతికి కంకణం" ధరించానన్నారు. మరి "దేవుడిచ్చిన" ఈ భూమిని గిరిజనులకు దక్కేటట్లు చేస్తారా? లేక మునుపటి కాంగ్రెసు వాడి తమ్ముడే "ఈ అన్న" అని ఋజువు చేసుకుంటారా?

ప్రకృతి సహజమైన భూమి సమస్యను పై చట్టాలు అమలుజరిపి చట్టబద్ధమైన వాతావరణం కల్పిస్తారా? లేక భూమి సమస్యను భూమి దగ్గరే తేల్చుకోమన్న అల్లూరి బాటనే కొండమొదలు గిరిజనులు పయనించేలా చేస్తారో అది మీ ప్రభుత్వం, కొండమొదలు గిరిజనులకు చెందివున్న భూమిపట్ల వ్యవహరించే విధానం బట్టి వుంటుందని మరోసారి మీ దృష్టికి తెస్తున్నాను.

ఇట్లు

**27-1-84** మానం రామారావు

**జనశక్తి ఆఫీసు, గుంటూరు-2**

**భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమైక్యతా కేంద్రం**

**(మార్క్సిస్టు-లెనినిస్టు)**

**(ఆంధ్రప్రదేశ్)**



**2001-గుంటూరులో రైకూసం మహాసభల సందర్భంగా కా॥కె.ఎస్, ఎం.ఎస్, బి.డి.శర్మలతో కా॥ఎమ్మార్; (ఎడమ) జెండా ఆవిష్కరణ చేస్తున్న కా॥ఎం.ఆర్**




**2001 ఏప్రిల్ 7,8,9 తేదీలలో, గుంటూరులో జరిగిన రైకూసం రాష్ట్రమహాసభలలో ప్రసంగిస్తున్న కామ్రేడ్ ఎమ్మార్; వేదికపై ప్రొ॥కె.ఆర్.చౌదరి, బి.డి.శర్మ**

**నిబద్ధ కమ్యూనిస్టు...**(మొదటిపేజీ తరువాయి)

రహస్యంగా వుంటూనే ప్రజాకార్యకలాపాలు సాగించారు. 1972లో పోలీసులు కామ్రేడ్ ఎమ్మార్‌ను అరెస్టుచేసి ఎన్నివిధాల బెదిరించినా, తలొగ్గక నిబ్బరంగా నిలచి జామీనుపై విడుదలై విప్లవ కార్యక్రమాలలో నిమగ్నమయ్యారు.

**వర్గపోరాటాలకు కొండంత అండగా...**

1977 తదనంతర కాలంలో ప్రజా ఉద్యమాలపై నిర్బంధాన్ని ఖండిస్తూ, పీడిత ప్రజాఉద్యమాలకు అండగా కామ్రేడ్ ఎమ్మార్ రాష్ట్రవ్యాపితంగా పర్యటించారు.

భూస్వాముల నుండి తమ భూముల స్వాధీనం కోసం తూర్పుగోదావరి జిల్లా కొండమొదలు ఆదివాసులు సాగించిన పోరాటంపై 1982 నవంబరు 29న పోలీసులు కాల్పులు జరిపి కామ్రేడ్స్ కుంజం రాజులు, మడెం లక్ష్మయ్యలను హత్యగావించారు. ప్రభుత్వ, పోలీసుల ఈ దుర్మార్గాన్ని ఎలుగెత్తి ఖండించటంలోనూ, యుద్ధరంగంలో నున్న ప్రజల పోరాటధృతి సడలకుండా ధైర్యాన్ని అందించటంలోనూ కామ్రేడ్ ఎమ్మార్ నిర్వహించిన పాత్ర చిరస్మరణీయమైనది.

1997లో గుంటూరుజిల్లా - పల్నాడు ప్రాంతంలో కామ్రేడ్ విశ్వమోహనరెడ్డి నాయకత్వంలో భూమి సమస్యపై పెద్దఎత్తున కదిలిన పీడిత ప్రజానీకంపై ప్రభుత్వ, పోలీసు యంత్రాంగం క్రూర నిర్బంధం ప్రయోగించి, కొండమోడులో నిర్మించుకున్న గుడిశలను కూల్చివేసి, ప్రజల్ని భీతావహుల్ని చేసిన సందర్భంలో..... ఇతర నాయకులతో కలసి ప్రజలకు అండగా నిలిచి, పోలీసుల దాడులను నిశితంగా ఎండగట్టడంలో కామ్రేడ్ ఎమ్మార్ చూపిన తెగువ, ప్రజలకందించిన స్థైర్యం విలువైనవి.

గుంటూరుజిల్లాలో కామ్రేడ్ అంగడి చెన్నయ్య నాయకత్వంలోని 'ప్రజాపోరు'-నాటి సిపిఐ (ఎం-ఎల్-యూనిటీఇనీషియేటివ్)ల ఐక్యతా క్రమంలో-2001లో-పోలీసు ఉన్నతాధికారులు, పెత్తందారులు కామ్రేడ్ చెన్నయ్యపై తమ దుష్ప్రచారాలను తీవ్రం చేసి దిగజార్చాలని చేసిన దుష్టప్రయత్నాలను కా॥ఎమ్మార్ 'తన తరహాలో' ధీటుగా తిప్పికొట్టారు.

**నిబద్ధతగల కమ్యూనిస్టు విప్లవకారునిగా...**

దాదాపు ఏడు దశాబ్దాల తన కమ్యూనిస్టు ఉద్యమ రాజకీయ జీవితంలో మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచనా విధానం పట్ల చెదరని విశ్వాసంతో, కమ్యూనిస్టు క్రమశిక్షణ, నిబద్ధతగల కామ్రేడ్‌గా ఎమ్మార్ కడదాకా కొనసాగారు. ఒక మధ్యతరగతి రైతుగా కమ్యూనిస్టుపార్టీలో ప్రవేశించి, సొంత ఆస్థి పెంచుకోకుండా, మిగుల్చుకోకుండా కమ్యూనిస్టు ఆదర్శాలకనుగుణంగా నిలిచారు.

'జనశక్తి' పత్రిక, కరపత్రాలు, పార్టీ సాహిత్యాన్ని నిరంతరం ప్రచారంలో వుంచటంలో కామ్రేడ్ ఎమ్మార్ ముందుండేవారు. కాలు సహకరించని పరిస్థితుల్లో, మంచంమీద వుండి కూడా పార్టీకి సంబంధాలను, సహకారాన్ని సమీకరించటానికి తపనతో కృషిచేశారు. అనారోగ్యం, వృద్ధాప్యంతో ఉద్యమ కార్యకలాపాలలో పాల్గొనలేకున్నా, నిర్మాణ క్రమశిక్షణకు కట్టుబడినవానిగా, పద్ధతిగా తన జమా ఖర్చులను ఎప్పటికప్పుడు పార్టీ బాధ్యులకు అప్పగించేవారు. కమ్యూనిస్టుపార్టీ, రైతు-కూలీ నిర్మాణాలలోని కార్యకర్తలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిన కా॥ఎమ్మార్‌కు సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్రకమిటీ విప్లవజోహార్లర్పిస్తోంది. ✤

# గిరిజనోద్యమానికి అండగా నిలిచిన కామ్రేడ్ మానం రామారావు

*ఎమర్జెన్సీ చీకటి పాలనలో కా॥మానం రామారావు రహస్య జీవనం సాగించారు. ప్రజలతో సంబంధాలు కలిగివుంటూ అనేక ప్రజాసమస్యలపై ప్రజలను కదిలించారు. ఎమర్జెన్సీ పాలన ముగిసిన తర్వాత పార్టీ నిర్ణయానుసారం బహిరంగ రాజకీయ జీవనంలోకి వచ్చారు. "జనశక్తి" పత్రిక సంపాదకుడిగా బాధ్యతలు చేపట్టారు.*

*ప్రభుత్వ పాశవిక నిర్బంధకాండకు గురైన శ్రీకాకుళం, తూర్పుగోదావరి గిరిజనోద్యమాలు వెనుకపట్టు పట్టాయి. గిరిజనోద్యమాన్ని పునర్మిర్మించేందుకు పార్టీ చర్యలు తీసుకుంది. వీటిలో కా॥మానం రామారావు తన వంతు పాత్రను నిర్వహించారు. జిల్లా అధికారులకు గిరిజన సమస్యల పరిష్కారాన్ని కోరుతూ విజ్ఞప్తులు అందజేయటానికి గిరిజనులతో కలిసి వెళ్లారు. గిరిజన సంఘాల పునర్నిర్మాణంలో చురుకుగా పాల్గొన్నారు. వాటి వివరాలిక్కిడ పొందుపరుస్తున్నాం.*

**- సంపాదకుడు**

## "భూమి సమస్యను గిరిజన సంఘం ద్వారానే పరిష్కరించుకుందాం" శ్రీకాకుళంజిల్లా 6వ గిరిజన మహాసభలో కా॥ఎం.ఆర్

శ్రీకాకుళంజిల్లా 6వ గిరిజన మహాసభ జూన్ 15, 1978న మొండెంఖల్ అమర్‌నగర్‌లో ఉత్సాహపూరితంగా జరిగింది. దాదాపు 175 గ్రామాలనుండి, 20 మైళ్ల దూరంనుండి కూడా ప్రజలు హాజరయ్యారు. 1500 మందితో మొండెంఖల్‌లో వూరేగింపు జరిగింది. ప్రభుత్వ ఫాసిస్టు నిర్బంధకాండ తర్వాత ఇంత పెద్దఎత్తున ప్రజలు ఊరేగింపు చేయటం ఇది రెండవసారి. 1975 మేలో జరిగిన 5వ మహాసభకు ఈ విధంగానే ఊరేగింపు జరిగింది. ఈ సభలో ప్రారంభోపన్యాసం చేసిన కా॥మానం రామారావు ఇలా అన్నారు.

'ప్రజల సమస్యలను మౌలికంగా పరిష్కరించలేని ప్రభుత్వాలు ఎన్నిమారినా ప్రజలకు ఒరిగేదేమీ లేదు. ప్రజలు తమ సంఘటిత పోరాటాలద్వారా మాత్రమే అనేక విజయాలు సాధించగలరు. నక్సల్బరీ, శ్రీకాకుళం పోరాటాలు తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటపు కొనసాగింపు. ఈ పోరాటాల్లో ప్రజలు వెల్లువలా కదిలి భూములు ఆక్రమించుకుని ఇప్పటికే అనుభవించ గలుగుతున్నారు. అనేకమంది అమరవీరుల త్యాగఫలితమిది. ఈ మహాసభకు అనేకమంది మృతవీరుల భార్యలూ, తల్లులు, బంధువులూ వచ్చారు. అమరవీరుల ఆశయాన్ని కొనసాగించడానికి మనం సంఘటితం కావాలి. భూమి సమస్యను గిరిజన సంఘంద్వారా పరిష్కరించుకొందాం' అని చెప్పి బాపట్ల, తదితర ప్రాంతాల్లో ప్రజలు బంజరు భూములకోసం చేస్తున్న పోరాటాలనూ, వాటి అనుభవాలనూ వివరించి చెప్పారు. ప్రజలను అణచివేయటంతప్ప ప్రజాసమస్యలను ప్రభుత్వాలు పరిష్కరించవనీ, మన సంఘటితశక్తిపై ఆధారపడా'లని పిలుపునిచ్చారు.

**(5-7-1978 "జనశక్తి" సంచిక నుండి)**

## "ప్రభుత్వ బూటకపు సంస్కరణలకూ, గిరిజన కార్పోరేషన్ దోపిడీకి వ్యతిరేకంగా పోరాడండి"! శ్రీకాకుంజిల్లా 7వ గిరిజన మహాసభ పిలుపు

1982 మార్చి 10న శ్రీకాకుళంజిల్లా 7వ గిరిజన మహాసభ మొండెంఖల్‌లో కామ్రేడ్ వెంపటాపు నగర్‌లో జరిగింది. దాదాపు 150 గ్రామాలనుండి 2500 మంది హాజరయ్యారు. ఆరిక గుంపుస్వామి అధ్యక్షతన జరిగిన ఈ సభలో కామ్రేడ్స్ మానం రామారావు, గుణధర్ ముర్మ, మోషే తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభోపన్యాసం చేసిన కామ్రేడ్ రామారావు శ్రీకాకుళం గిరిజనోద్యమ చరిత్రను వివరించారు. 'దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా పోరాటం ఉద్భవించింది. మీరు చేసిన పోరాటం ఫలితంగానే ప్రభుత్వం సంస్కరణ పేరుతో ముందుకొస్తున్నది. సంస్కరణల పేరుతో మనం సాధించుకున్న భూములను మనకు కాకుండా చేస్తున్నది. జాతాపులు, సవరలు అంటూ విచక్షణ చూపి మన ఐక్యతను దెబ్బతీయటానికి ప్రయత్నిస్తున్నది. దీనికి వ్యతిరేకంగా మనం ఐక్యంగా నిలిచి పోరాడాలి. గిరిజనుల కోసంమంటూ పెట్టిన కార్పోరేషన్‌యొక్క దోపిడీని ఎదిర్చి పోరాడాల'ని పిలుపునిచ్చారు.

అతివాద దుస్సాహసిక పంథావల్ల ఉద్యమం వెనుకపట్టు పట్టిన క్రమాన్ని వివరిస్తూ, అమరుడు కా॥టి.ఎన్.నాయకత్వంలో ఉద్యమ పునర్నిర్మాణానికి తీసుకున్న చర్యలను వివరించారు. నక్సల్బరీ, శ్రీకాకుళం పోరాటాలకు రివిజనిస్టుల, నయారివిజనిస్టుల విద్రోహాన్ని చెప్పి అతివాదంవైపు కొట్టుకు పోవటంలో చౌదరి తేజేశ్వరరావు పాత్రను వివరించారు. ఈనాడు ఆ తేజేశ్వరరావే సిపియంలో చేరాడు. ఆ పార్టీలో చేరమని మనకు సలహాలిస్తున్నాడు అంటూ ఆయన దివాళాకోరు రాజకీయాలను ఎండగట్టారు. గిరిజనసంఘం మద్దతుతో గెలిచిన వెంపటాపు భారతి దిగజారుడు పద్ధతులను ఎండగట్టి, కా॥వెంపటాపు సత్యంకూతురిగా, గిరిజన సంఘ కార్యకర్తగా ఆమె పాత్రను సమీక్షించవలసిందిగా మహాసభను కోరుతున్నాను.

**(20-3-1982 "జనశక్తి" సంచిక నుండి)**

## "కాల్పులకీ, కటకటాలకీ జడవబోం!" "మా భూమిని విడువబోం"! కొండమొదలు ఏరియా గిరిజన సంఘం ద్వితీయ మహాసభ ప్రతిన

నక్సల్బరీ, శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాటాల ఉత్తేజంతో ప్రారంభమైన కొండమొదలు ఉద్యమం అనేక ఒడిదుడుకుల నధిగమిస్తూ పురోగమిస్తున్న క్రమంలో, 1982 నవంబరు 29న కుంజం రాజులు, మడెం లక్ష్మయ్యలను ప్రభుత్వం తుపాకీ కాల్పులతో కిరాతకంగా బలిగొంది.

తొలకరి నుండీ భూముల స్వాధీనానికి పూనుకుని 33 ఎకరాల వరి, 120 ఎకరాల జొన్న, మిర్చి పైర్లను వేసుకున్న గిరిజనులు పంట పొలాలను నాశనం చేయాలని పన్నిన కుట్రను ఎదిర్చినందుకు జరిగిన బీభత్సకాండ ఇది. తమ పంటలను రక్షించుకోవటానికి వందలమంది గిరిజనులు ఐక్యశక్తిగా నిలిచినందుకు జరిగిన మారణకాండ యిది. గిరిజనుల పంటలను, భూములను భూస్వాములకు కట్టబెట్టడానికి ప్రభుత్వం తన చట్టాలను తానే అతిక్రమించి గిరిజనోద్యమాన్ని రక్తపుధారలతో తడిపిన ఘటన ఇది.

ఏజన్సీ గిరిజన సంఘం నవంబరు 29న కొండమొదలులో బహిరంగ సభను ప్రకటించింది. దానికి విస్తృత ప్రచారాన్ని సాగించింది. సభ తర్వాతనుండీ తమ భూములలో వేసుకున్న పంటలను కోసుకునేందుకు కార్యక్రమాన్ని నిర్ణయించుకుంది. ఈ బహిరంగసభలో పాల్గొని, పంటల కోతలలో గిరిజనులకు మద్దతుగా నిలిచేందుకు నవంబరు 27నే కా॥మానం రామారావు కొండమొదలు చేరుకున్నారు. భూస్వాములూ, అధికారులూ సాగిస్తున్న కుట్రలను ప్రజలకు వివరిస్తూ, పంటల కోతలకు వారిని సంసిద్ధం చేస్తున్నారు. నవంబరు 27 ఉదయమే పంటచేలలోకి పశువులను తోలి అవి పంటను నాశనం చేస్తుంటే చూస్తూ ఆనందించారు, భూస్వాములూ, పోలీసులు! గిరిజనులు పశువులను బయటకు తోలటంతో పోలీసులు గిరిజనులపై లాఠీఛార్జీ చేశారు. ప్రజలు ఎదిరించటంతో పోలీసులు వెనక్కు తగ్గారు. ఈ అనుభవంతో వెంటనే పంటకోసుకునేందుకు గిరిజనులు సిద్ధమయ్యారు. సాంప్రదాయక ఆయుధాలు చేబూని పంటల కోతలకు పూనుకున్నారు. పోలీసులు వచ్చినా బెదరక బాణాలు ఎక్కుపెట్టి పంటను కోసి ఇంటికి తెచ్చుకున్నారు. దీనితో అధికారులు రంపచోడవరం నుండి రిజర్వు పోలీసులను దింపారు. భూస్వాములు తోలిన పశు వులను కంచెవేసి వుంచారు. కొందరు దానికి కాపలాగా వుండగా, మిగిలినవారు పోడు పొలాలకు వెళ్లారు. 29 ఉదయం పోలీసులు విరుచుకుపడి, పశువులను విడిపించుకు వెళ్లేందుకు పూనుకున్నారు. ప్రతిఘటించిన గిరిజనులపై కాల్పులు చేశారు. ఇద్దరు యువకులను బలిగొన్నారు. పోడునుండి గిరిజనులు పరుగు పరుగునా రావటంతో పలాయనం చిత్తగించారు.

ఈ క్లిష్ట సమయంలో కా॥మానం రామారావు గిరిజనులతోనే వున్నారు. ప్రజలకు ధైర్యం చెప్పారు. గాయపడిన లక్ష్మయ్యను రంపచోడవరం ఆస్పత్రికి పంపారు. దారిలో గెద్దాడ చేరేసరికే లక్ష్మయ్య అమరులయ్యారు. కా॥రామారావు మరికొన్ని రోజులు అక్కడే వుండి గిరిజనులకు ధైర్యంచెప్పి మిగిలిన భూముల్లో పంటల కోతకు సిద్ధంచేశారు. బయటకు వచ్చిన తర్వాత జిల్లా అధికారులను కలిసి గిరిజన భూములను వారికే పంచమనీ, కాల్పులకు కారకులను శిక్షించమనీ డిమాండు చేశారు. రాజమండ్రి, కాకినాడ, గుంటూరు, ఒంగోలుల్లో సభలు జరిపి, విలేఖరులకు వివరించి గిరిజనులకు జరిగిన అన్యాయంపట్ల ప్రజాభిప్రాయాన్ని మలచటానికి కృషిచేశారు.

కాల్పులు జరిపినా, కటకటాలపాలుజేసినా గిరిజనులు వెనుదిరగలేదు. భూమి పోరాటాన్ని కొనసాగించారు. తమ పోరాటాన్ని మదింపు చేసుకునేందుకు 1983 జూన్ 24న రెండవ మహాసభ జరుపుకున్నారు. దీనిలో కా॥మానం రామారావు తన ప్రారంభోపన్యాసంలో ఇలా చెప్పారు.

'తెల్లవాడి గుండెలకు విల్లంబు ఎక్కుపెట్టి హడలు పుట్టించి వీరోచితంగా పోరాడిన మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు పోరాట గడ్డ యిది. ఇక్కడే కామ్రేడ్స్ కుంజం రాజులు, మడెం లక్ష్మయ్యలు నేడు భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడి వీరమరణంపొంది ఆ పోరాట వారసులయ్యారు. అంతేకాక ఆనాటి దోపిడీ అంతం కాలేదనీ అందుకే ఈ పోరాటం పుట్టిందనీ మరోసారి ఈ వీరులు చాటి చెప్పారు. దోపిడీ అంతమయ్యేదాకా ఈ పోరాటం నిర్విరామంగా సాగుతుంది.

పల్లపు భూస్వాముల దోపిడీ, పీడనలకీ, ఫారెస్టు అధికారుల జులుంకి బ్రిటీషు వలసపాలనకు వ్యతిరేకంగా సాయుధంగా పోరాడి అమరుడైన అల్లూరికి జయంతుత్సవాలు ఘనంగా జరుపుతామని ఎన్.టి.ఆర్. ప్రకటించారు. ఆనాడు గిరిజనుల, దేశ ప్రయోజనాలకోసం పోరాడి అమరుడైన అల్లూరికి జయంతుత్సవాలు జరపబోయే ఎన్‌టి రామారావుకి, అల్లూరి నడిపిన పోరాటానికి వారసులైన ఇద్దరు గిరిజనులను కాల్చి చంపిన పోలీసుల్ని, భూస్వాములను శిక్షించాలనీ, న్యాయవిచారణ జరిపించాలన్న విజ్ఞప్తిని చెత్తబుట్టలో వేసి, ఈనాటి కొండమొదలు పోరాటాన్ని అణచివేసేందుకు అణచివేతలో ఆరితేరిన పోలీసు అధికారుల్ని నియమిస్తున్న ఎన్‌టి రామారావుకి అల్లూరికి జయంతుత్సవాలు జరిపే నైతిక హక్కుందా? ఆనాడు భగత్‌సింగ్‌ను ఉరితీయటానికి అభ్యంతరం చెప్పని గాంధీ, ఆయన వారసురాలైన ఇందిరాగాంధీ విప్లవకారుల్ని దేశద్రోహులుగా చిత్రించి హత్యలు చేయించి, మరోవైపున భగత్‌సింగ్ దేశభక్తుడని చిలకపలుకులు పలికినట్లే, ఎన్‌టి రామారావు కూడా ఎదురుకాల్పులు జరిపిస్తూనే నాటకమాడుతున్నాడు. నాటకం పాతదే నటుడే కొత్తవాడు; వేషం కొత్తది. ఈ వేషాలు చూసి మోసపోవద్దు. 1980 నాటినుండీ నేటివరకూ జరిగిన కృషినీ, పొందిన పోరాట అనుభవాలనూ, సాధించిన విజయాలను సమీక్షించి, ఆ విజయాలను కాపాడుకొనటానికి గత అనుభవాలను నెమరువేసుకుని, లోపాలను సరిదిద్దుకుని, ఈ పోరాటాన్ని విస్తరింపచేసేందుకు నడుంకట్టండి'. (ఈ విషయమై నాటి ముఖ్యమంత్రి ఎన్‌టి. రామారావుకు కా॥ఎం.ఆర్.రాసిన బహిరంగలేఖ రెండవ పేజీలో చూడండి)

(5-7-1983 జనశక్తి సంచికనుండి)

## "బూటకపు ఒప్పందాలను ఎదుర్కొని భూమికోసం పోరాడుతున్న కొండమొదలు గిరిజనులపై పోలీసు నిర్బంధాన్ని ఖండించండి" కామ్రేడ్ మానం రామారావు

భూస్వాములతో కుమ్మక్కు అయిన పోలీసులు, రెవిన్యూ అధికారులు కొండమొదలు గిరిజనులు పండించుకున్న పంటను వారికి దక్కనీయకుండా భూస్వాములకు కట్టబెట్టడానికి దమననీతికి పాల్పడుతున్నారు. 1984 జనవరి 29వ తేదీన నడిపూరు గ్రామంపై బడి స్త్రీలు, పిల్లలు, వృద్ధులను విపరీతంగా బాదారు. వేట్ల శ్రీరాములును తుపాకీ మడమతో కొట్టారు. ఏడుగురు గిరిజనులను అరెస్టుచేసి బేడీలు వేసి తీసుకెళ్లారు.

ఆరోజు ఉదయమే గిరిజనులు కోసుకున్న 4 బస్తాల జొన్న కంకులనూ, వేట్ల శ్రీరాములుకు చెందిన 4 బస్తాలు కొండజొన్నలనూ పోలీసులు కాపలాగా నిలవగా భూస్వాముల మనుషులు ఎత్తుకెళ్లారు. వారిలో భూస్వామి శివయ్య పాత్రుని మనుమడు ఉమామహేశ్వరరావు ఒకడు. ఇదేమి అన్యాయమని అడ్డువెళ్లిన ముదుసలి స్త్రీ నడివూరు గంగమ్మ, కుండ్ల లక్ష్మమ్మలను చావబాదారు. మరునాడు కొండమొదలు అంతటా 144వ సెక్షను విధించారు. అదనపు బలగాలను తరలించారు. అరెస్టు చేసిన వారిని దేవిపట్నం స్టేషన్‌లో అక్రమ నిర్బంధంలో నాలుగు రోజులుంచి తప్పుడు కేసు బనాయించి రాజమండ్రి జైలుకు పంపారు. వారికి బెయిలివ్వలేదు.

అప్పటికి 13 ఏళ్లుగా భూమి సమస్యను తన చట్టాల ప్రకారమే పరిష్కరించమని అనేక రూపాలలో గిరిజనులు కోరుతున్నప్పటికీ మన్నుతిన్న పాములా ప్రభుత్వం వ్యవహరించింది. 1983 నవంబరులో వరిపంట కోతకు వచ్చిన సమయంలో రెవిన్యూ, పోలీసు యంత్రాంగమంతా కదలి వచ్చారు. భూమి సమస్య గురించి మాట్లాడకుండా, అరెస్టులు చేస్తాం, కాల్పులు సాగిస్తాం అంటూ బెదిరింపులు సాగిస్తూ, మరోవైపున కోళ్లు, గొర్రెలు యిస్తామని లాలిస్తూ బూటకపు ఒప్పందాన్ని ఒక దానిని (గిరిజనులు పండించిన పంటలో సగం భూస్వాములకివ్వాలని) గిరిజనులపై రుద్దటానికి ప్రయత్నించారు. గిరిజనులు ఈ మోసాన్ని ఎండగట్టి ఒప్పంద ప్రతిపాదనను తిరస్కరించారు. వరదలో నష్టపోగా మిగిలిన 35 ఎకరాల వరిని కోసుకుని పంచుకున్నారు. జొన్న పంటను కూడా దక్కించుకోవాలన్న పట్టుదలతో వున్నారు.

జొన్న పంటను భూస్వాములకు కట్టబెట్టే కుతంత్రంతో ప్రభుత్వం అదనపు పోలీసు దళాలతో కొండమొదలును నింపింది. రెవిన్యూ అధికారులు రాజీ ప్రతిపాదనలు చేస్తుండగా పోలీసులు గ్రామాలపైబడి బీభత్సాన్ని సృష్టించారు. అందులో భాగంగానే నడిపూరుపై దాడి జరిగింది. విచక్షణా రహితంగా గిరిజనులపై దౌర్జన్యకాండ జరపటంతోపాటు పోలీసులే రక్షణగా నిలిచి గిరిజనుల పంటను భూస్వాముల కప్పగించారు. తర్వాత 144వ సెక్షన్ విధించటంతో, ప్రభుత్వం భూస్వాములతో కలసి కుట్రచేస్తున్నదని స్పష్టమైంది. తన చట్టాలను తానే అమలుజరపలేని వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవటానికి గిరిజనులపై దాడులుచేసే దుర్మార్గానికి ప్రభుత్వం దిగజారింది.

ప్రభుత్వ నిర్బంధంకానీ, లాలింపుకానీ గిరిజనులను ప్రక్కదారి పట్టించలేవు. తమ జొన్నపంటను దక్కించుకోవటానికి, తమ భూములను నిలబెట్టుకోవటానికి వారు కృత నిశ్చయంతో వున్నారు. ఇంత నిర్బంధం జరుగుతున్నా కొక్కిరగూడెం మహిళలు 10 ఎకరాల్లో జొన్నపంటను కోసుకున్నారు. పోలీసులు 16 మంది మహిళలను పోలీసు క్యాంపుకు తీసుకువెళ్లినా కోసుకున్న పంట పోలీసు, భూస్వాముల చేతిలో పడకుండా కాపాడుకున్నారు.

ప్రతి తొలకరిలోనూ రెవిన్యూ అధికారులురావటం, భూములు పంచుతామని వాగ్దానం చేయటం, తిరిగి పంటల కోతల సమయంలో రావటం పంటను భూస్వాములకప్పజెప్పే ఒప్పంద ప్రతిపాదనలు చేయటం, దానికి అంగీకరించని గిరిజనులపై పోలీసులను ఉసిగొల్పటం పరిపాటి అయింది. దీనినుండి భూమిసమస్య భూమివద్దే తేలుతుందని గిరిజనులు నేర్చుకున్నారు.

భూస్వాములు, రెవిన్యూ పోలీసు అధికారులూ కుమ్మక్కుఅయి గిరిజనులపై సాగిస్తున్న దమనకాండను ఖండించటం, నిర్బంధకాండను త్రిప్పికొట్టడం ప్రజాతంత్రవాదుల, విప్లవకారుల, ప్రజలందరి కర్తవ్యం.

1. అరెస్టు చేసిన వారందరినీ వెంటనే బేషరతుగా విడుదల చేయాలి.
2. పోలీసు క్యాంపును తక్షణమే ఎత్తివేయాలి.
3. గిరిజనులపై పోలీసు దాడులనూ, గిరిజన కార్యకర్తలపై సాగిస్తున్న గాలింపు చర్యలనూ వెంటనే ఆపుచేయాలి.
4. గిరిజనుల పంట గిరిజనులకే చెందాలి.

**8-2-1984** **- మానం రామారావు**

# ప్రతియేటా వరద బీభత్సానికి గురవుతున్న పాత బాపట్ల తాలూకా రైతాంగ దుర్భర పరిస్థితి
# మింట మబ్బుపడితే గుండె ఝల్లుమంటున్న రైతు

(పంటచేల మురుగునీటి పారుదల వ్యవస్థపై కా॥ఎమ్మార్ నిశిత అధ్యయనానికి ఈ కరపత్రం ఓ నమూనా **– సంపాదకుడు)**

**రెండువందల** సంవత్సరాల బ్రిటిష్ వలస పాలనలో కాని, 30 సంవత్సరాల కాంగ్రెస్ దళారీ పాలకవర్గాల పాలనలోగాని, ఇప్పుడు జనతా పాలనలోగాని మనదేశంయొక్క ఏ మౌలిక సమస్య గూడా పరిష్కారం కాలేదు, కాదు. వ్యవసాయం ప్రధానవృత్తిగా వున్న మనదేశంలో నీరుకు కొరవలేకపోయినా, సరైన నీటిపారుదల సౌకర్యాలు లేక నదీజలాలు వ్యర్థమవుతూ వరద బీభత్సం సృష్టిస్తున్నాయి. నీటి పారుదల సౌకర్యాలు వున్న ప్రాంతాలకు, సరైన మురుగునీటి సదుపాయాలు లేక వరద ముప్పు అతి తరచుగా వస్తోంది. పాలకవర్గాలు పదవులు పంపకం కోసం, ప్రజలను, ప్రజా ఉద్యమాలను సులభంగా అదుపులో పెట్టుకునే ఉద్దేశంతో పొన్నూరు, బాపట్ల, చీరాల అనే మూడు తాలూకాలుగా విభజించినా పాతబాపట్ల తాలూకా మొత్తాన్ని వరదసమస్య మాత్రం అధికంగా పీడిస్తోంది.

## ఇబ్బంది వచ్చినపుడు పబ్బం గడపటం పరిష్కారమా?

1857లో బ్రిటిష్‌వారు విజయవాడనుండి మద్రాసుకు కాలువ త్రవ్వారు. విజయవాడనుండి మద్రాసుకు పడవలలో సరుకులరవాణా జరుగుతుండేది. విజయవాడ నుండి గంజాంవరకు, 70 మైళ్ళ పొడవున వున్న ఈ కాలువ ప్రధానంగా వ్యవసాయానికి నీటిపారుదల సౌకర్యాన్ని కలిగిస్తున్నది. దీన్ని మద్రాసు కాలువ, కొమ్మమూరు కాలువ, బకింగ్‌హోమ్ కెనాల్ అని మూడు పేర్లతో పిలుస్తుంటారు.

వరదలు వచ్చినప్పుడల్లా వివిధ రాజకీయ పార్టీలు, పార్లమెంటరీ ప్రతిపక్షాలు, కొందరు స్వార్థపర వ్యక్తులు తమ పదవుల ప్రాబల్యంకోసం తమ ప్రాంతానికే వరదలు వచ్చినట్లు ఆ ప్రాంతానికే పరిమితమై, అరకొర పరిష్కారాన్ని కోరుతూ ప్రకటనలు చేస్తున్నారు. సభల తతంగాలు జరుపుతున్నారు. ఇబ్బంది వచ్చినపుడు పండగరోజు పబ్బం గడిపినట్లు పాలకవర్గాలు నామమాత్రపు సౌకర్యాలు కల్పిస్తూ, వాటికి విస్తృత ప్రచారం ఇస్తూ ప్రకటనల వర్షాన్ని కురిపిస్తున్నారు. అలాంటి సహాయక సౌకర్యాలలో ఎక్కువభాగం రాజకీయ దళారీలు, లంచగొండి పెద్దఉద్యోగస్తులు స్వాహా చేస్తున్నారు. కానీ ఈ మూడు తాలూకాలను ఏకంగా ముంచెత్తుతున్న వరదల తీవ్రత నివారణ గురించి గాని, ప్రతిఏటా ప్రజలు ఎదుర్కొంటున్న కరువు, కాటకాలు, యిబ్బందులు గురించిగాని ఏ ఒక్కరూ పట్టించుకోవటంలేదు. అందుకని అసలు ఈ మూడు తాలూకాలను ఏకంగా ముంచెత్తుతున్న వరదల గురించి కొంచెం లోతుగా ఆలోచించడం అవసరం. అప్పుడే వాటి శాశ్వత నివారణ యెడల ఒక అవగాహన ఏర్పడుతుంది.

## మురుగు కాలవలా! జీవనదులా!

మద్రాసుకాల్వ, విజయవాడ నుండి గంజాం వరకు 70 మైళ్ళు వుంటే, అందులో 40 మైళ్ళవరకు పాతబాపట్ల తాలూకా గుండా ప్రవహిస్తోంది. వర్షాలు కురిసినపుడు ఈ కాలువకు పడమరవైపునున్న వాగులు పొంగి పొర్లి పరవళ్ళు త్రొక్కుతూ నీరంతా పడమర వైపున నిలబడుతుంది. ఇలా పొంగిపొర్లే వాగులు; నక్కవాగు, నల్లమడవాగు, సాకికాల్వ, పర్చూరువాగు, కప్పలవాగు, అలేరు, అప్పేరు, ఏమిలేరు మొదలగు వాగులు పొంగి పొర్లటంవల్ల వచ్చే వరదలనుండి సాగుభూమికి, పడవల రవాణాకు ఎట్టినష్టం వాటిల్లకుండా వుండేందుకు ఆనాడు బ్రిటిష్‌వారు నైసర్గిక పరిస్థితులనుబట్టి, భూమి ఏటవాలును బట్టి ఈ కాలువకు అనేకచోట్ల అడుగు భాగాన తూములు కట్టారు. వాటిని ఈ ప్రాంతాల ప్రజలు 'దొంగతూములు' (అండర్‌టన్నెల్స్) అంటారు. కొల్లిమర్లవద్ద నక్కవాగుకి, బంగళావద్ద నల్లమడ వాగుకి, కారంచేడువద్ద పర్చూరు వాగుకి, సాకి కాల్వకు, స్వర్ణ, అప్పేరు, మద్దిరాల, ఈదుమూడి టన్నెల్స్ కట్టి మద్రాసుకాల్వ మీదుగా వరదనీరు పోయేట్లు చేశారు. వరద మిక్కుటంగా వచ్చినపుడు తూములు ఎత్తినపుడు కట్టమీదనుండి తూర్పువైపుగా పొర్లి పారటానికి వీలుగా 1 నుండి 4 ఫర్లాంగుల వరకు రాతిగోడతో అవుట్లు కట్టారు. ఇలా 40 మైళ్ళ పొడవునా 7 చోట్ల కట్టారు. అవుట్లకు మించి గూడా వరద వచ్చినపుడు సాగుభూముల నీటివసతికి, పడవల రవాణాకు నష్టంరాకుండా వుండటానికి కాల్వకు తూర్పువైపున 'సర్‌ప్లస్'లు కట్టారు. వరద వచ్చినప్పుడు పైకెత్తిన ఈ సర్‌ప్లస్‌లను వరద తగ్గుముఖం పట్టగానే క్రిందికి దించుతారు. ఇలా కట్టిన సర్‌ప్లస్‌లకి కొల్లిమర్లవద్ద 11 ఖానాలు, నల్లమడవద్ద 25 ఖానాలు, కుంకలమర్రు వద్ద 12 ఖానాలు, రావూరువ్ద 12 ఖానాలు, ఉప్పుగొండూరు సర్‌ప్లస్‌కి 2 ఖానాలు చొప్పున కట్టారు. ఇలా సర్‌ప్లస్‌లు, దొంగతూములు, అవుట్లద్వారా వచ్చిన వరదనీరు ఈ 40 మైళ్ళలో మూలపాలెం, గంజాం వరకు వున్న రొంపేరు భూమిలో నిల్వవుండి, బ్రిటిష్ వారు 1889లో సదరన్ మారాటా రైల్వే‌బ్రాడ్గేజి(నేటి మద్రాసు రైలులైను) పేరుతో నిర్మించిన రైలురోడ్డు దాడి నెలరోజుల దాకా సముద్రంలోకి పోతూనే వుంటుంది.

జాగర్లమూడి పైనుండి జీవనదిగా వచ్చిన తుంగభద్ర, కొల్లిమర డ్రయిన్‌లో మాచవరంవద్ద రైలురోడ్డు దిగువన కలసినందున యాజలఫిర్కా, పొన్నూరు ఫిర్కాల పైరులు నెలరోజులపాటు నీటమునిగి వుంటాయి. తెనాలి తాలూకా, మోపర్రు ఏరియా మొత్తం మురుగు, నిడుబ్రోలుకు తూర్పుగా వచ్చి తుంగభద్రలో కలిసి సముద్రంలోకి పోతుంది.

ఇంగ్లీషువారు ఇరిగేషన్‌తోపాటు మురుగునీటి పథకాలు కూడా అమలుపరిచారు. అవి ఇప్పుడు సాగులోకి తేబడిన భూములు ఎక్కువభాగం ఆనాడు బీళ్ళుగాను, పరుపులుగాను వున్నపుడు అమలు పరచబడ్డాయి. 1942కి పూర్వం రొంపేరు బీడుగా వుండేది. రెండవ ప్రపంచయుద్ధ సమయంలో ఇంగ్లీషు వారే అధికాహారోత్పత్తి చేయండని పిలుపిచ్చినందున, భూదాహంతోవున్న గ్రామీణ పేదలు ఇరిగేషన్ సౌకర్యం లేకపోయినా పైనుంచి వచ్చే మురుగు నీటితోనే సాగుకి పూనుకున్నారు.

## మంచినీటి మహాసభలు

1942 నుండి తాలూకాలో రాజకీయ చైతన్యంగల కార్యకర్తలు గ్రామీణపేదల సమస్యలమీద పనిచేసి బలమైన ఉద్యమం నిర్మించారు. 1947లో అధికారమార్పిడి తర్వాత బంజర్ల పట్టాలకొరకు, మురుగు-వరద నివారణకొరకు ఆందోళన జరిగింది. ఇంకొల్లు, పర్చూరు ఫిర్కా 'మంచినీళ్ళ మహాసభలు' జరిగాయి. ఈ ఆందోళనల ఫలితంగా ఇంగ్లీషువారు నిర్మించిన దొంగతూముల ప్రక్కన కొన్నిఖానాలు పెంచటంపై మురుగు డ్రయిన్స్‌లో లంకలు, తుంగ, జమ్మిదిబ్బలు తొలగించి కట్టలు పెంచటం జరిగింది. వర్షపు నీరైనా పూర్తిగా పొయ్యేదానికి ఉపయోగపడని ఈపురుపాలెం డ్రయిన్, బాపట్ల మున్సిపాలిటి నుండి త్రవ్వకాల్వ తవ్వినా వరదల శాశ్వత నివారణ కొరకు పాలకవర్గాలు ఇంతవరకు కనీస చర్యలు కూడా తీసుకోలేదు.

కొన్ని సమయాల్లో కొన్ని ప్రాంతాలను మాత్రమే పూర్తిగా ముంచెత్తుతున్న వరదలు వస్తున్నప్పటికీ, 1936 తుపాన్ నుండి ఆ తర్వాత తరచుగా ప్రతియేటా వస్తున్న వరదలకు; పాండ్రపాడు-పొన్నూరు రోడ్డు, కాకుమాను-బాపట్ల రోడ్డు, చెరుకూరు - ఎదుళ్ళపల్లి రోడ్డు, పర్చూరు-చీరాలరోడ్డు, రావూరు-వేటపాలెం రోడ్డు, ఇంకొల్లు -కడవకుదురురోడ్డు కనిపించకుండా వరదనీరు అటు ఇటు పొర్లి పరవళ్ళు త్రొక్కుతుంది. గుంటూరునుండి బయలుదేరి వచ్చే రోడ్డులో నందిపాడు, పర్చూరు, ఇంకొల్లువద్ద రోడ్లు మునిగిపోయి వరద పారుతుంది. ఈ రోడ్డుకు పడమట వైపు నున్న పాలపర్రు, దేవరపల్లి వగైరా గ్రామాలన్నీ జలమయం అవుతూనే వుంటాయి.

1969లో వచ్చిన వరదవల్ల మెట్ట, మాగాణి పైర్లు పాత బాపట్ల తాలూకా అంతా వరదనీటిలో మునిగి కనుచూపుమేర సముద్రంలా కనిపిస్తూ జనం, పశువులు, ఇండ్లు, పశుగ్రాసముతోసహా కొట్టుకొని పోయినవి. శిధిలమైన రోడ్లకొరకు ప్రతి సంవత్సరం రిపేర్లపేరిట లక్షలు ఖర్చుచేస్తున్నారు. కాంట్రాక్టర్లు, లంచగొండి అధికారులు దీనిని లాభసాటి వ్యాపారంగా సాగిస్తున్నారు. ఈనాడు గ్రామాలలో సహితం యీ కాంట్రక్టర్ల సంఖ్య ఎంతో అభివృద్ధి చెందిందంటే వరద నివారణ చర్యల వైఫల్యం ఎంతవుందో అర్థం చేసుకోవచ్చు.

మద్రాసుకాల్వ పడమరవైపు నాలుగైదుమైళ్ళు, కెనాల్ దిగువున మద్రాసు రైల్వేలైన్ మధ్య మురుగు, వరదనీరు నిల్వవుండి నేరుగా పోయే మార్గం లేదు. రొంపేరు ప్రాంతంలో నిల్వవుండి కొన్ని సందర్భాల్లో నెలరోజులకిగాని సముద్రంలోకి పోవటంలేదు.

1969 వేసవిలో, 1976 నవంబరులో, 77 నవంబరులో, 78 ఆగస్టులో వచ్చిన వరదలతో మన తాలూకా వరదల తాలూకాగానే వుండిపోయింది. ఆగస్టు 15నుండి ఈ నెలవరకు వచ్చిన మూడు వరదలకి మొత్తం మెట్ట మాగాణి నీట మునిగింది. ఇప్పటికి రెండుసార్లు అతి ప్రయాసతో దూరప్రాంతాల నుండి నారుతెచ్చి నాట్లువేస్తే మళ్ళీ యిప్పుడు వచ్చిన వరద మూలిగేనక్కమీద మూడిత్తుల తాటికాయ పడినట్లు, రైతుకు దెబ్బమీద దెబ్బతగిలి తల్లడిల్లి పోతున్నాడు ఈనాటివరకూ, చేలో నాటినపైరునుండి చేతికొచ్చిందాకా నమ్మకంలేకుండా రైతాంగం బ్రతకలేక బ్రతుకుతున్నారంటే వరదల నివారణ చర్యల బూటకత్వం బయటపడలేదా?

ఆనాటి కృష్ణా-పెన్నార్ పథకానికి వ్యతిరేకంగా, నాగార్జునసాగర్ కావాలనే ఆంధ్రరైతాంగం సత్తెనపల్లిలో జరిపిన రైతు మహాసభలోనే సాగర్ సాగువల్ల వచ్చే మురుగు, దిగువ భూములను ముంచకుండా ప్రత్యేక మురుగు నివారణ సౌకర్యాల గురించి సాగర్ నిర్మాణంతోపాటే ఆలోచించి పూనుకోవాలని తీర్మానం చేశారు. అయినా వరద నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

కృష్ణానది ఆనకట్టకు 100 సం॥లు నిండి పగుళ్ళు యిచ్చిందని, ఏ నిమిషంలోనైనా ఆనకట్ట కొట్టుకు పోయే ప్రమాదం వుందని ఆనాడు రైతు సంఘం ఆందోళన చేసినా పట్టించుకోని ప్రభుత్వం, చివరకు కీ॥శే॥ వేపా కృష్ణమూర్తిగారి మరణంతో కృష్ణాబ్యారేజి నిర్మాణానికి పూనుకొంది. దీనివల్ల మద్రాసుకాల్వ సుమారు 3 అడుగులు రీడింగ్ పెరిగింది. బ్యారేజి నిర్మాణానికి పూర్వం మొత్తం కృష్ణా పశ్చిమడెల్టా ఆయకట్టు క్రింద గుంటూరుజిల్లాలో మొత్తం సాగు 3 లక్షల 5వేల ఎకరాలు. బ్యారేజి నిర్మాణం తర్వాత మొత్తంసాగు 5 లక్షల 30వేల ఎకరాలు. అంటే 2 లక్షల 25 వేలకి పెరిగింది. గుంటూరుజిల్లాలో భాగంగా కొమ్మమూరు కాలవ క్రింద బ్యారేజికి పూర్వం 1 లక్షా 2 వేల ఎకరాలు సాగైతే, తర్వాత సుమారు లక్షా 50వేలు సాగవుతున్నది. కాబట్టి తాలూకాలో సాగుప్రాంతం కూడా పెరిగింది, దానితోపాటు మురుగు ప్రమాదంకూడా పెరిగింది. అందువల్ల ఆనాడే రైతుసంఘం పెరుగుతున్న మురుగు ప్రమాదాన్ని ప్రభుత్వం దృష్టికి తెచ్చి శాశ్వత వరద నివారణకు పూనుకోవాలని డిమాండ్ చేసింది. అయినా ఫలితం శూన్యం.

## పంటలు పోయినా పన్నులు తప్పవు

వరదలు పెరిగి రైతాంగాన్ని ఆందోళన పరుస్తున్నప్పుడల్లా ప్రభుత్వం డ్రైనేజి నిపుణుల కమిటీలు, అంచనాల సంఘాలు వేస్తూనే వుంది. చివరికి మిత్రా కమిటీ వాడుకలోకి వచ్చింది. ప్రమాదం ముంచుకొచ్చినప్పుడల్లా ఇలా కమిటీల మీద కమిటీలు వేసి పబ్బం గడపటమేగాక, రైతాంగాన్ని ఉద్ధరించటానికని డ్రైనేజి సెస్సుపేరిట చట్టంచేసి మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా, పంటలు పోయి అవస్థలు పాలయిన రైతులదగ్గరే ఎకరాకి రు.15.00 చొప్పున గోళ్ళూడగొట్టి వసూలు చేస్తున్నారు. సెస్సు అధికభాగం దుర్వినియోగమై ఆశించిన ఫలితం చేకూరలేదు. ఈ చట్టాన్ని 1974లో మరో 5 సం॥లు పొడిగించి మొత్తం నేటికి 10 సం॥లనుండి డ్రైనేజి సెస్సు వసూలు చేస్తున్నా వరద నివారణ జరగలేదుగాని, డ్రైనేజి సిబ్బంది, దాని ఖర్చులు, కాంట్రాక్టర్లు మాత్రం పెరిగారు.

ప్రతియేటా వరదలు వచ్చినప్పుడల్లా పార్లమెంటరీ పదవుల పార్టీలు కేవలం రోడ్లు, డ్రైనేజి రిపేర్లకి కోట్లు కేటాయించాలనీ, తక్కువ ధరలకి ఎరువులు, క్రిమిసంహారక మందులు సరఫరా చేయాలని, సబ్సిడీలు ఇవ్వాలని ప్రకటనలు చేస్తుంటారు. ఏటవాలుగావున్న భూమినిబట్టి పాత బాపట్ల తాలూకా మొత్తం ప్రాంతంలో ఒకేసారి సమగ్రమైన చర్యలు తీసుకుంటేగాని శాశ్వత వరద నివారణ సాధ్యంకాదని తెలిసినా తమతమ ప్రాంతాలకి పరిమితమై ప్రకటనలు చేస్తున్నారు. పంటే చేతికిరాని పరిస్థితులుంటే ఎరువులు, మందుల గురించి మాట్లాడటం అర్థంలేని విషయం. అలాగే ప్రాంతాలుగా చీల్చి పరిష్కారం ఆలోచించడం స్వార్థంతో కూడుకున్న విషయం.

ఆంధ్రప్రజల ఆందోళన ఫలితంగా సాధించుకొన్న నాగార్జునసాగర్ అభివృద్ధిని గురించి గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం, 'ఆహారం లోపలికి పోయేమార్గం వరకే ఆలోచించి, పనికిరాని పదార్థం బయటికిపోయే మార్గం గురించి ఆలోచించకపోతే మనిషి ఏమవుతాడో, అలాగే సాగునీరు సౌకర్యం కల్పించి, మురుగునీటి సౌకర్యం కల్పించకపోతే ప్రయోజనం ఏమిటి? అసలు ఇవిరెండూ కవల పిల్లలలాంటివి. కానీ మురుగునీటి సౌకర్యంయెడ ప్రభుత్వ నిర్లక్ష్యవైఖరిని పాత బాపట్ల ప్రాంతంచూసి అర్థం చేసుకోవచ్చు. బాపట్ల తాలూకాయేకాదు, కొల్లేరు, బుడమేరు, దేశంలోని ఏ ప్రాంతాల డ్రైనేజి పరిస్థితి చూచినా దీనికి భిన్నంగాలేదు.

## వరద నివారణలో విజయం సాధించిన జనచైనా

31 సం॥ల స్వతంత్ర భారతదేశంలో, 'సోషలిస్టు' రాజ్యంలో పాలకవర్గాలు సాధించిన గొప్ప అభివృద్ధి ఏమంటే 120 సం॥నాడు బ్రిటిషువారు నిర్మించిన మురుగు, వరద నివారణ పథకాలను అవకతవకలుగా అమలుజరపమే. తూములు కాల్వలు రిపేర్లు చేసినా శాశ్వత పరిష్కారంకోసం కనీస చర్యలు కూడా చేయలేదు. అయితే జనచైనా మనకంటే వెనక జాతీయ విముక్తిని పొందినా మనకంటే ముందే వరదలను శాశ్వతంగా నివారించగలిగింది. కారణం అది ప్రజల ప్రభుత్వం కాబట్టి. మింట మబ్బుపట్టిందంటే వరదరాక తప్పదని గడగడ వణకిపోయే పరిస్థితి మన రైతాంగంలో వుంటే, రైతులను దోపిడీచేయడం, దోపిడీదారుల ప్రయోజనాలను రక్షించటం, ప్రజల పోరాటాలను రక్తపుటేరులల్లో ముంచటమే ధ్యేయంగా పెట్టుకున్న ఈ దోపిడీ ప్రభుత్వం (కేంద్రం, రాష్ట్రం) "వరదలను అరికట్టడం అసాధ్యం" అని సిగ్గుమాలిన ప్రకటనలు చేస్తుంది. కానీ ప్రకృతినే ప్రజల ప్రయోజనాల కనుగుణంగా మార్చుకున్న పరిస్థితి జనచైనాలో వుంది.

మద్రాసు కాల్వక్రింద వున్న ప్రాంతం మొత్తం గతంలో మెట్టభూమి అయినందున కురిసిన వర్షం కొంతభూమిలో యింకిపోయి, పైనుండి వచ్చే వరదవల్ల యీనాడున్నంత ప్రమాదం వుండేది కాదు. నేడు సాగరు ప్రాంతం, కొమ్మమూరు కాల్వ పడమర వైపు మాగాణి అయినందున పైన "పిల్లి వుచ్చపోస్తే" నేరుగా తాలూకా మొత్తం ముంచేస్తుంది.

ఈ మురుగు నివారణకు శాశ్వత పరిష్కారం రూపొందించకపోతే రైతాంగం పరిస్థితి నానాటికి దిగజారుతుంది. ఆర్థిక సంక్షోభాల కారణంగా పండించిన పంటకు గిట్టుబాటుధర లేకపోగా, ఈ వరదల మూలంగా అసలు పంటలే లేకుండా పోతున్నాయి. కనుక రైతాంగమంతా పార్లమెంటరీ పార్టీలు విధించే సంకుచిత పరిధులు దాటి కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి చెప్పినట్లు ప్రత్యక్ష కార్యాచరణకు దిగటమే మార్గం. కాబట్టి సమైక్యంగా మురుగు నివారణ (వరదల నివారణ) సమస్య పరిష్కారంకోసం, 40 మైళ్ళ పొడవునవున్న తూములు, కాల్వలు యుద్ధప్రాతిపదికపై అభివృద్ధి చేసేవిధంగా ఈ క్రింది కోర్కెల సాధనకై పోరాడుదాం.

(1) నక్కవాగు దొంగతూములు, నల్లమడ దొంగతూములు, సాకికాల్వ, దొంగతూములు, కారంచేడు దొంగతూములు, స్వర్ణ, అప్పేరు, మద్దిరాల, ఈదుమూడి ఇలా 8 చోట్ల కట్టిన దొంగ తూములను ఈనాటివరద, వర్షపాతానికి తగినట్లు రెట్టింపుచేయాలి.

(2) కొల్లిమర డ్రైన్ తుంగభద్ర కలిసిన చోటు నుండి, పేర్లిడ్రైన్ త్రవ్వకాల్వ, కొత్తపాలెం డ్రైన్, ఈపురుపాలెం, వేటపాలెం స్ట్రెయిట్‌కట్స్, రొంపేరు కాల్వలలోతు, వెడల్పు ఇప్పుడున్న దానికంటే పెంచాలి.

(3) అపారంగా వస్తున్న నాగార్జునసాగర్ ఆయకట్టు మురుగు నివారణ కొరకు ప్రత్యేకంగా డ్రైనేజి పథకం అమలు జరపాలి.

(4) డ్రైనేజి సెస్సు మొత్తంగా రద్దుచెయ్యాలి.

(5) రైతాంగం కోలుకొనేదాకా భూమిశిస్తు, నీటితీరువా రద్దుచెయ్యాలి.

పై కోర్కెలు ప్రకటనలద్వారా, విజ్ఞప్తులద్వారా నెరవేరేవి కావు. సంఘటిత రైతాంగ ఉద్యమం ద్వారానే సాధించుకోవాలి. అనేక ఆందోళనల్లో అనుభవం, పోరాట సాంప్రదాయం కలిగివున్న మన పాతబాపట్ల రైతాంగం పోరాటంద్వారానే పై కోర్కెలు సాధించుకొంటుంది.

**భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమైక్యతా కేంద్రం(ఎం.ఎల్)**

**బాపట్ల తాలూకా**

**(20-9-1978 'జనశక్తి' నుండి)**

# పొగాకు గిట్టుబాటు రేటుకు సంఘటిత పోరాటమే శరణ్యం!

## భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమైక్యతా కేంద్రం (యు.సి.సి.ఆర్.ఐ.-మా.లె) పిలుపు!

*(పొగాకు రైతుల సమస్యలపై-ముఖ్యంగా గిట్టుబాటు రేటు సమస్యపై కా॥ఎమ్మార్ రైతులను కదిలించేందుకు తీవ్రంగా కృషి సలిపారు. 1983 టంగుటూరులో జాతీయ రహదారిపై పోలీసు కాల్పులకు ముందునుండీ నిర్దిష్ట అధ్యయనం, స్పష్టమైన అవగాహనతో రైతులను కూడగట్టారు. కా॥ఎమ్మార్ క్షేత్రస్థాయి పరిశీలనకు ఈ కరపత్రం అద్దంపడుతోంది.*
*- సంపాదకుడు)*

భారతదేశములోని పొగాకు ఉత్పత్తిలో 90% ఆంధ్రప్రదేశ్‌లో ఉత్పత్తవుచున్నది. 75వేల రైతులు పొగాకు పండించుచున్నారు. గ్రేడు, ఆకు విరుచుడు లాంటి పనుల్లో మరొక లక్షమందికి పైగా మహిళా కార్మికులకు పని దొరుకుతుంది. ఇతర ఉద్యోగాలలో 20 వేలమంది పనిచేస్తుంటారు. మొత్తంగా పెద్దఎత్తున ఉపాధి కలుగుతుంది.

ఈ పరిశ్రమలవల్ల రు.200 కోట్లు విదేశీ మారకద్రవ్యం, రు.800 కోట్లు ఎక్సైజ్ సుంకంగా కేంద్ర ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. మరియు సిగరెట్లపై వేసే పన్నువల్ల ఎన్ని వందల కోట్లు ప్రభుత్వ ఖజానాకు వస్తుందో బహిర్గతం కాని విషయం.

ధనిక రైతులతోసహా సంవత్సరము పొడుగునా, రేయింబవళ్ళు ఎండనకా, వాననకా అడ్డమైన చాకిరీ చేయుచున్నారు. తాను కొనే ఎరువులు, చీడపురుగుల మందులు, షావుకార్లు చెప్పిన అధిక రేటుకే కొనాలి. బొగ్గుకు ముందే డబ్బుకట్టినప్పటికీ వ్యాగన్లులేవనే పేరిట రైతుకు సప్లయిచేయుటలేదు. లారీలతో తెచ్చుకుందామనిపోతే నానా యిబ్బందులు పెట్టుతూ బొగ్గు లోడు సకాలంలో చేయని కారణంగా బాడుగ ఎక్కువై ఎక్కువ రేటు పడుతుంది. రైతు ఒకేరకం పొగాకు బేళ్ళను ప్యాసింగుకు ప్లాట్ ఫారమ్‌లో పెట్టితే ఒక్కొక్క బేలుకు ఒక్కొక్క రేటు వేస్తూ సగటు రేటు తగ్గిస్తారు. పెత్తందార్ల, భూస్వాముల బేళ్ళకు ఎప్పుడూ మంచిరేట్లే యిస్తుంటారు. ఏమీచేయలేని బక్కరైతులు ఆ యిబ్బందులన్నీ పడలేక గత్యంతరం లేని స్థితిలో అయిన కాడికి అమ్ముకొని నష్టాలపాలవుతున్నారు.

నీటి పారుదల సౌకర్యాలు లేనందువలన సారవంతమైన భూములన్నింటికీ సరైన పంట చేతికి రాక బాధలు పడుతున్న రైతులు పొగాకు సేద్యం చేయక తప్పడంలేదు. ఈ వాణిజ్య పంటద్వారానైనా తమ సమస్యలు పరిష్కారమౌతాయనుకొనే రైతుల ఆశలు అడియాసలే అవుతున్నాయి. ఏదో ఒక సంవత్సరం తప్ప మిగతా అన్ని సంవత్సరాలూ ఖర్చులు గూడా చేతికిరాక, బ్యాంకు అప్పులు తీరక బ్యాంకుల్లో తాకట్టుపెట్టిన వస్తువులు (నగలు) తిరిగి తీసుకురాలేక(ఎవరో కొద్దిమంది మినహా) నానా అగచాట్లకు గురౌతున్నారు.

గ్రామాలలో భూస్వాములు-భూస్వామిగా, రాజకీయ నాయకుడిగా పలుకుబడి నుపయోగించి పొగాకును కొంటారు. ఎస్.టి.సి. ఆర్డర్లు, బోగస్ సొసైటీల లైసెన్సులు, విదేశీ ఆర్డర్సుగూడ వీరికే వస్తాయి. ఈలాంటి వారికి ఐ.ఎల్.టి.డి. కంపెనీ ఆశీస్సులు గూడ వుంటాయి.

మనదేశంలో పుగాకు రేటు నిర్ణయిస్తున్నది ఐ.ఎల్.టి.డి. విదేశీ కంపెనీయే. దీన్నే మిగతా కంపెనీలు అనుసరించుతాయి. పలుకుబడి కలిగిన భూస్వాముల, రాజకీయ నాయకుల బిడ్డలకు ఉన్నతోద్యోగాలు కూడ యిచ్చి గ్రామాల్లో తన పట్టును ఇది నిలుపుకుంటుంది. ఐ.ఎల్.టి.డి. కొద్దిరోజులు మాత్రమే మార్కెట్‌లో ఉంటుంది. తర్వాత చిన్న, పెద్ద(ప్రైవేట్)కంపెనీలు తక్కువ రేటుకు రైతునుండి కొని మరలా గ్రేడు చేయించి ఐ.ఎల్.టి.డి.కే అమ్ముతారు. ఈవిధంగా ఐ.ఎల్.టి.డి. కొంతమంది ఏజంట్లను ఏర్పాటు చేసుకొంటుంది.

గ్రామాలలో పెత్తందార్ల నాయకత్వాన రైతు సొసైటీలు పెట్టారు. ఆ సొసైటీలలో సభ్యత్వంగల రైతుల నుంచి కొద్దిపాటి పొగాకును కొని, గ్రేడు చేయించి, రైతుల పొగాకును అమ్మకుండా ఎస్.టి.సి. యిచ్చిన ఆర్డర్లకు ఏదో ఒక పద్ధతిలో గుత్త కంపెనీల పొగాకునే అమ్ముతారు. గ్రామాల్లో పెద్ద మొత్తంలో పొగాకు వేసేవారి పేరగూడ ఎన్.టి.సి. ఆర్డర్లు తెప్పించి వారికి పావలో, బేడో యిచ్చి ఈ గుత్త కంపెనీల పొగాకునే అమ్ముకున్న సంఘటనలు అనేకం. పెద్ద కంపెనీల యజమానులే బోగస్ సొసైటీలను పెట్టించి తమ పొగాకును అమ్ముకుంటున్నారు.

గ్రామాల్లో కుక్కగొడుగుల్లా వెలసిన కంపెనీలు స్టాండర్డు కంపెనీలకంటే పదిరూపాయలు రేటు ఎక్కువే వేస్తారు. అయితే మరలా వచ్చే సీజనులోనే డబ్బు యిస్తారు. దివాళాతీసి బోర్డులు ఎత్తేసి రైతులకు ఎగ్గొట్టేవారు గూడ తగుసంఖ్యలో వున్నారు. మార్కెటింగ్ గ్యారంటీ లేని కారణంగా ఎవరు అడిగినా యిచ్చి రైతులు దివాళా తీస్తుంటారు. వీరే మరు సంవత్సరము ఇంకొక పేరుతో కంపెనీపెట్టి అదే పని చేస్తుంటారు.

ఒకవైపున కంపెనీల దోపిడీ ఈ విధంగా యధేచ్ఛగా సాగుతుంది. మరొకవైపున నానాటికీ పెరిగిపోతున్న వ్యవసాయ ఖర్చులు, రైతు నవనాడులూ కుంగదీస్తున్నాయి. పెరిగిపోతున్న ద్రవ్యోల్బణం కారణంగా పరిస్థితి మరింతగా దిగజారి పోతూవుంది. 1978లో ఎకరాకు అయ్యే ఖర్చులు మొత్తం రు.2500 ఉండగా, ఈ ఐదేళ్ళలో అది రెట్టింపు అయింది. ఈ పెరుగుదలకు అనుగుణంగా పుగాకు ధర మాత్రం పెరగటంలేదు.

| ఖర్చులు | 1979 | 1988 |
|---|---|---|
| 1. భూమి కౌలు | 800 | 1000 |
| 2. సేద్య ఖర్చులు | 330 | 450 |
| 3. ఎరువులు | 140 | 400 |
| 4. నారు | 200 | 200 |
| 5. నారువేత ఖర్చులు | - | 170 |
| 6. నాటుతో మొత్తం కూలి | 550 | - |
| 7. పురుగు మందులు | - | 50 |
| 8. రైతు కుటుంబ శ్రమ | - | 400 |
| 9. బ్యారన్ బాడుగ | 140 | 400 |
| 10. కాల్పు ఖర్చు | 340 | 600 |
| 11. ఎద్దడివల్ల నీరు కట్టుటకు | - | 300 |
| 12. గ్రేడు, పచ్చాకు కూలి | - | 500 |
| 13. టోకరు, సూపర్‌వైజర్స్ | - | 50 |
| 14. మెయింటనెన్స్ | - | 100 |
| 15. పెట్టుబడికి వడ్డీ | - | 500 |
| | 2500 | 5120 |

ఎకరాకు రు.5000లకు పైగా ఖర్చు పెడితే 3 లేక 3 1/2 క్వింటాళ్ళు కాల్చిన పొగాకు (ఎర్రనేలల్లో ఇంకా తక్కువే) దిగుబడి వస్తుంది. అంటే 3 క్వింటాళ్ళ దిగుబడి రైతుకు రు.1450 గాను, 4 క్వింటాళ్ళ దిగుబడి రైతుకు రు.1350లు పైగా దిగుబడి రేటు పడుతుంది. ఇది రైతు వద్దకి పోయి అన్ని ఖర్చులు కూడి సగటు కడితే వచ్చే లెక్క. ఈ సంవత్సరము అనేక కారణాలవల్ల 25%-30% పొగాకు మాడిపోతున్న విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలి.

బ్రిటన్ మనలను పాలించేటప్పుడు ఐయల్‌టిడి కంపెనీ మన దేశంలో మంచి నల్లరేగడి నేలల్లో పొగాకు వేయించి రుచి చూపించారు. అందరూ ఈ వాణిజ్య పంట వేయటం ప్రారంభించేటప్పటికి ఎప్పుడూ ఒకే పంటవేసే పొలాలు పనికి రావని రేట్లు తగ్గిస్తూ కొత్త ప్రాంతాల్ని ప్రోత్సహిస్తూ కొంతకాలం ఎక్కువరేట్లు ఇస్తుంటుంది. ప్రతి సంవత్సరం పంటలు మార్చివేయటానికి ధనిక రైతులకు కూడ సాధ్యంకాని పని. ఇక క్రింది వారికి కలలో కూడా సాధ్యం కాని పని. ఒక్క భూస్వాములకే సాధ్యం. ఈవిధంగా కూడ అసమానమైన రేట్లు నిర్ణయించబడుతుంది. నాన్ ఏరియాగా ప్రకటించిన ప్రాంత పొగాకును కూడ తక్కువ రేటుకు కొంటూనే వుంది. తక్కువ రేటుకు కొనడంలో కూడ ఇది ఒక ఎత్తుగడ.

ఏ దేశమైనా ఆ దేశంలో ఉత్పత్తి చేసిన సరుకును తానే మార్కెట్ చేసి విదేశ ఆర్డర్లు పొంది వారికి అమ్ముతుంది. ప్రపంచం మొత్తం మీదనే పొగాకు వ్యాపారంపై గుత్తాధిపత్యం కలిగిన మూడు కంపెనీలలో ఒకటైన ఐ.టి.సి. బ్రిటిష్ వలస పాలనకాలంలో మన దేశంలో ప్రవేశించింది. దాని కొనుగోలు బ్రాంచి అయిన ఐయల్‌టిడి నేరుగా రైతాంగం వద్దకుపోయి పొగాకు ధరను తానే నిర్ణయించే గుత్తాధికారాన్ని చేపట్టింది. 1947 అధికారమార్పిడి తర్వాత గూడ నేరుగా రైతుల వద్దనుండే కొంటుంది. మరియు ఇక్కడే సిగరెట్టు ఫ్యాక్టరీలు పెట్టి అనేక పేర్లతో గుత్తాధిపత్యం చెలాయిస్తూ ఆ రేట్లను గూడ కంట్రోలు చేస్తుంది. గ్రామాల్లోని భూస్వాముల, పలుకుబడి కల్గిన రాజకీయ నాయకుల బిడ్డలకు ఉన్నతోద్యోగాలు కొద్దిపాటి పరిశ్రమల లైసెన్సులు యిప్పించి, రాజకీయ పార్టీలకు చందాలు యిచ్చి అన్నివిధాల వత్తాసును పొందుతుంటారు. దీన్ని బట్టే మనదేశ స్వతంత్రతను అర్థంచేసుకోవచ్చు.

సోషల్ సామ్రాజ్యవాదులు వారి ఏజంటు కంపెనీ (నవభారత్ మొదలగు)ల ద్వారా కొంటూ ప్రత్యక్షంగా మన రైతాంగానికి కనబడకుండా దోపిడీ చేస్తున్నది. అయితే నవభారత్ కంపెనీని గురించి (ఆలస్యంగా డబ్బు యిచ్చే కంపెనీ అని) ప్రధానంగా కమ్యూనిస్టు ప్రాబల్యంగల గ్రామ రైతాంగానికి బాగా తెలుసు. అటువంటి పొగాకు కంపెనీ రష్యాకు ఏజంటు గిరే గాక సిగరెట్టు ఫ్యాక్టరీలకు మరి యితర రంగాలకు ఎగబ్రాకుతుంది.

ఐయల్‌టిడి కంపెనీ రంగంలోనికి రానిదే, ఇతర ఏ కంపెనీలూ కొనుగోలుకు రావు. దాని రేటుకు మించిన రేటు పెట్టవు (అరుదైన సమయాలలో మినహా) ఈ కంపెనీ కొద్దిరోజులు మాత్రమే మార్కెట్‌లో వుంటుంది. తర్వాత దాని ఏజంటు కంపెనీలు పరిస్థితులను బట్టి ఎంత తక్కువకు వీలైతే అంత తక్కువకు కొని గ్రేడుచేసిన తర్వాత ఐయల్‌టిడి కొంటుంది. ఇది రష్యా నుండి నేర్చుకున్న పాఠం.

ప్రభుత్వంలో పలుకుబడి కలిగిన వారు బోగస్ బొగ్గు సొసైటీలను సృష్టించి వాటిద్వారా మద్రాసు, కర్నాటక రాష్ట్రాలకు చేర్చి అధిక లాభాలు గడిస్తూ -వాస్తవమైన రైతు సొసైటీలకు బొగ్గు రానందున బొగ్గుకు డబ్బు కట్టి కూడా బ్లాకులో టన్ను 1కి రు.350 లు నుండి-రు.550లు వరకు కొనుక్కోవలసి వస్తుంది. ఇది రైతాంగానికి ప్రభుత్వ అధికారులకు, తెలిసిన బహిరంగ రహస్యం.

ప్రతిపక్ష పార్టీలు, నాయకులు కుస్తీపట్టి ప్రభుత్వాధికారుల ఐ.యల్.టి.డి. నవభారత్ కంపెనీల ఏజెంట్లతో కూడిన, రైతులు లేని పొగాకు బోర్డు నొకదాన్ని సాధించారు. ఇది ఎక్కువ గ్రేడుల పద్ధతిని ప్రవేశపెట్టింది. పొగాకు బోర్డు విధానాలు గుత్త కంపెనీలకే ఉపయోగంగా వున్నవి. పొగాకు బోర్డు, యస్.టి.సి.లు కొనుగోలు కేంద్రాలు తెరచినవి. వీటిల్లో జరిగిన కుంభకోణాలు రైతులు కొందరైనా అర్థంచేసుకున్నారు.

పొగాకు బోర్డు యస్‌టిసి మార్కెట్‌లోకి రావాలని వీరంతా కాకిగోల చేస్తుంది, వీరికి వాటి ఆచరణ తెలియకనా? లేక వాటిపై భ్రమలు కల్పించటానికా?

అరటిపండు వలిచి చేతిలో పెట్టమనే పద్ధతిలో బోర్డు ప్రకటించిన గ్రేడుల ప్రకారం ఒకటో గ్రేడు రు.1650లు, రెండో గ్రేడు రు.1450లు, మూడో గ్రేడు రు.1350లు, నాలుగో గ్రేడు రు.1250లు, ఐదో గ్రేడు వెయ్యి రూపాయలు, ఆరో గ్రేడు రు.850లు, చివరి గ్రేడు అంటే మాడు రు.500లు ఉండాలని రైతు సంఘాలు సూచించినాయి. ఇన్ని గ్రేడుల పద్ధతే పెద్ద దగా. ఆ గ్రేడులకే రేట్లు నిర్ణయించి డిమాండుచేసే వారిని ఏమని అర్థం చేసుకోవాలి? ఈన తీసిన పొగాకు సిగరెట్ల ఫ్యాక్టరీకి పోవుటకు ఇన్ని గ్రేడులు అవసరమే లేదు. పొగాకును శుద్ధిచేసే పద్ధతులను బట్టే దానివల్ల తయారయ్యే సిగరెట్ల ధర పెరుగుతుంది. తెలుపు, పచ్చ, మాడులాంటి మూడు గ్రేడుల పద్ధతే చాలు. ఈ గ్రేడులే చాలా కాలము అమలులో వుంది. బోర్డు వచ్చిన తర్వాతే గ్రేడులు పెరిగినాయనేదే గమనార్హం. ఈ సంవత్సరము 30 శాతం వరకు మాడే దిగుతుంది. గత సంవత్సరము మాడు గూడ రు.1000లకు తక్కువ కాకుండా కొన్నారు. తెలుపు రు.1350లకు తక్కువకాకుండా కొన్నారు. అయినా ఏ కంపెనీకి నష్టం వచ్చిందన్న వినికిడి లేదు. అయితే చిన్న కంపెనీలకు లాభాలు తగ్గి వుండవచ్చు. ఫ్యాక్టరీలున్న కంపెనీలకు అంతులేని లాభాలు తప్ప, నష్టాలనే మాటేలేదు.

| | సిగరెట్లు | | రు.పై. |
|---|---|---|---|
| 1. | ఇండియా ఫిల్టర్ కింగ్స్ | 20 | 16-00 |
| 2. | క్లాసిక్ ఫిల్టర్ కింగ్స్ | 20 | 11-00 |
| 3. | గోల్డ్‌ఫ్రాక్ ఫిల్టర్ కింగ్స్ | 10 | 5-00 |
| 4. | విల్సులైట్స్ ఫిల్టర్ కింగ్స్ | 20 | 8-00 |
| 5. | విల్స్ ఫిల్టరు కింగ్స్ | 10 | 3-45 |
| 6. | విల్స్ ఫిల్టరు | 10 | 3-25 |
| 7. | క్యాప్సటన్ ఫిల్టరు కింగ్స్ | 10 | 2-50 |
| 8. | గోల్డ్ ఫ్లాక్ ఫిల్టరు | 10 | 2-40 |
| 9. | గోల్డ్ ఫ్రాక్ | 10 | 1-90 |
| 10. | విల్స్ ఫ్రాక్ ఫిల్టరు | 10 | 1-90 |
| 11. | బర్కిలీ | 10 | 1-85 |
| 12. | క్యాప్సటన్ ఫిల్టర్ | 10 | 1-50 |
| 13. | సిజర్స్ | 10 | 1-50 |

నల్లరేగడి నేలల్లో పండిన 1 కేజీ పొగాకుకు 1000 నుండి 1200 సిగరెట్లు, ఎర్రనేలల్లో పండిన 1 కేజీ పొగాకు నుండి సుమారు 1800 సిగరెట్లు తయారవుతాయి.

ఐ.టి.సి. కంపెనీ తయారుచేసే సిగరెట్ల మార్కెట్ ధరలు గమనించండి.

తెల్లపొగాకును శుద్ధిచేసి తయారుచేసిన సిగరెట్ల ఖరీదు 40 పైసలనుండి 80 పైసలవరకు వుంది. సగటురేటు పెరుగుతుంది. శుద్ధిచేసి తయారుచేసిన సిగరెట్ల రేటు 60 పైసలు. నల్లరేగడి నేల ఒక కేజీ పొగాకు నుండి 1000 సిగరెట్లకు 60 పైసలు వంతున రు.600లు వస్తుంది. తక్కువ రేటు సిగరెట్లు 1 కేజీ పొగాకుకు సగటున రు.250 వస్తుంది. అయితే వీటిల్లో ఖర్చులు వుంటాయి. 1 కేజీ పొగాకు పండిస్తే గతసంవత్సరము రైతుకు సగటున రు.10లు వస్తే, చేతులు మార్చిన కంపెనీ యజమానులకు (టుబాకో న్యూస్ ఆధారం) 7 లేక 8 రూపాయలు మిగిలితే, ప్రభుత్వానికి రు.42 1/2లు ఎక్సైజు సుంకం ద్వారా వస్తే, ఫ్యాక్టరీ యజమానులకు (వీటినుండి ఖర్చులు తీసివేయాలి) రు.250లు నుండి రు.600లు వచ్చినదన్నమాట. దీన్నిబట్టి ప్రభుత్వం, కంపెనీ యజమానులు, సిగరెట్ల ఫ్యాక్టరీ యజమానులు రైతును ఎలా దోపిడీ చేస్తున్నది అర్థమౌతున్నది.

రైతు సోదరులారా!

మొదటినుండి రైతాంగానికి గిట్టుబాటు ధరలు ఎప్పుడూ యివ్వలేదు. అందువల్లనే రైతులు నానాటికీ అప్పుల పాలై పొలాలమ్ముకొని వేరే ప్రాంతాలకు వలసలు పోతున్నారు. ఏ రూపాయికైనా గీతలు ఒకటేనన్నట్లు ఎక్కడికి పోయిననూ వారి ఇబ్బందులు అవే. రైతు సమస్యలు మౌలికంగా పరిష్కారము కానంత కాలం వారు నష్టాల వాత పడక తప్పదు. రైతాంగమంతా సంఘటితంగా నిలబడి దీర్ఘకాలంగా, నిత్యమూ సంఘటిత పోరాటాలు సాగించనిదే సమస్య పరిష్కారం కాదు. మోసపూరితమైన అనేక గ్రేడుల పద్ధతిని వ్యతిరేకించాలి. కనీస గిట్టుబాటు ధర అంటే మొదటి గ్రేడు రు.1600లు, తర్వాత గ్రేడు (ఆరవ గ్రేడు) రు.1400లు, మాడు రు.1200లు అయినా కనీసం వుండాలి. అప్పుడే గిట్టుబాటు ధర వస్తుంది.

రైతుల వద్దకు పోరాట పోజుతో పెద్ద కంపెనీల (నవభారత్) ఏజంటులు, ఐయల్‌టిడి కంపెనీల, మరితర కంపెనీల ఏజంట్లు- రైతుసంఘాల పేర, రాజకీయపార్టీల పేర అనైక్యంగా వున్న మన ముందుకు వచ్చి కొంతవరకు ప్రయాణము చేసి, తర్వాత కంపెనీ యజమానుల యిష్టానుసారము ఒప్పందాలు కుదుర్చుకొని తమ చేతులు దులుపు కుంటారు. గత పోరాటాల అనుభవంనుండి గుణపాఠాలు తీసుకొనకపోతే ఇదే పరిస్థితి మళ్ళీ మళ్ళీ ఎదురౌతూనే వుంటుంది.

ఈ దళారీ రాజకీయపార్టీలు, దళారీ కంపెనీలు, భూస్వాములు, సామ్రాజ్యవాదులు ఒకరి నొకరు పట్టుకొని నడుస్తున్నారు. రైతాంగమూ మరియు వారి నిజమైన మిత్రులూ, నిజాయితీగల రాజకీయపార్టీల అండతో స్వతంత్ర సంఘటితశక్తిగా రూపొందితేనే, ఎవరి చేతుల్లోనూ పడకుండా ముందుకు సాగగలుగుతారు. అప్పుడే వారు నిజమైన శక్తిగా రూపొందుతారు. తమ పంటలకు గిట్టుబాటు రేటు సాధించుకోగలుగుతారు.

**డిమాండ్లు:**

1. మొదటి గ్రేడుకు రు.1600లు, రెండవ గ్రేడు (ఆరవ గ్రేడు)కు రు.1400 లు, మాడుకు రు.1200లు రేటు యివ్వాలి.
2. ప్రకాశం జిల్లాలో సిగరెట్ ఫ్యాక్టరీలు నిర్మించాలి.
3. పొగాకు కొన్న పదిహేను రోజులలో డబ్బు చెల్లించాలి.
4. రసాయనిక ఎరువులు, చీడపురుగు మందులు సరసమైన ధరకు, సకాలంలో అందించాలి.
5. సకాలంలో బొగ్గు సప్లయి చేయాలి.

**- 5-2-1983 'జనశక్తి' నుండి**

---

వచ్చే సంచికలో

**రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో జరిగిన కామ్రేడ్ ఎమ్మార్ సంస్మరణ సభల రిపోర్టులు; కామ్రేడ్ కానూసన్యాల్, భగత్‌సింగ్‌ల వర్ధంతి రిపోర్టులు; మార్చి 8-అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాల రిపోర్టులు; విద్యుత్తు సమస్యపై వామపక్షాల ఐక్యకార్యాచరణ రిపోర్టులు; లక్షింపేట దళితుల సమస్యపై 'సంఘీభావ పోరాట కమిటి' ఆందోళనలు...**

(6వ పేజీ తరువాయి)

**సిపిఐ (ఎం-ఎల్) రాష్ట్ర నాయకులు కా॥ముప్పాళ్ళ భార్గవశ్రీ** మాట్లాడుతూ కడవరకూ కమ్యూనిస్టుగా జీవించిన ఎమ్మార్‌కు జోహార్లు చెప్పారు. ఆయనతో తనకున్న 40 సం॥ల అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. విప్లవాన్ని విజయవంతం చేసేందుకు సరైన కమ్యూనిస్టు పార్టీ, ఐక్యసంఘటన, ప్రజాసైన్యం అవసరమనీ; అతి-మితవాదాలకు వ్యతిరేకంగా ప్రజాయుద్ధపంథాలో సాగుతూ, అనేక విప్లవ పార్టీలను ఐక్యంచేసే కృషి సాగిస్తున్నామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కిరణ్‌ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీల ఐక్యకార్యాచరణ సోగుతోందని, దీనిని మరో సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమంగా ముందుకు సాగించాల్సిన అవసరం వుందని కా॥భార్గవశ్రీ పేర్కొన్నారు.

**ఏఐఎఫ్‌టియు (న్యూ) రాష్ట్రనాయకులు కా॥డివిఎన్ స్వామి** మాట్లాడుతూ 1972 నుండి, విద్యార్థిగా వున్నకాలంనుండీ, కామ్రేడ్ ఎమ్మార్‌తో వున్న అనుబంధాన్ని గుర్తుచేసుకొని జోహార్లర్పించారు. విద్యార్థి యువకులలో భారత దోపిడీ రాజ్యాంగం ఎడల కోపం, కసిని పెంచేవారని, నిరంతర ఆందోళనకారుడని, నిరంతర రాజకీయ ప్రచారకుడని అనేక సంఘటనలను ఉదహరించారు. ఈనాడు కమ్యూనిస్టులు ప్రచారాన్ని ఎంతగా కుదించుకుంటున్నారో పరిశీలిచుకోవాలన్నారు. నిర్బంధాన్ని ఖండించటంలో ఎమ్మార్ ముందుండేవారన్నారు. పొగాకు రైతుల సమస్యలపై కామ్రేడ్ ఎమ్మార్ తీవ్రంగా స్పందించారని, అనేక కార్యక్రమాలు చేపట్టారని, '83లో కాల్పులనంతరం ప్రజలను కూడగట్టడంలో ముందున్నారని, 1997లో కొండమోడులో ప్రభుత్వం పేదల ఇళ్ళను కూల్చిన పరిస్థితిలో ప్రజలను సమీకరించుకొని పోలీసు అధికారులతో తీవ్ర ఘర్షణపడ్డారనీ వివరించారు. స్కైలాబ్ పేరిట ప్రజలలో భయాందోళనలను పెంచటాన్ని శాస్త్రీయంగా విశ్లేషించే కరపత్రాలను తమను ప్రోత్సహించి రాయించేవారన్నారు. ఆనాటి తరం నిబద్ధతను ఒక అనుభవంగా, మన కార్యాచరణలో నిలపాలని కా॥డివిఎన్ స్వామి తన ఉపన్యాసంలో పేర్కొన్నారు.

సభాధ్యక్షులు కా॥గుర్రం విజయకుమార్ మాట్లాడుతూ సభకు రాలేకపోయిన సిపిఐ(ఎం-ఎల్) సిఓసి నాయకులు కా॥భూతం వీరన్న; పొన్నూరు డాక్టరు రాజారావుగార్ల సంతాప సందేశాలను సభికుల దృష్టికి తెచ్చారు.

'కామ్రేడ్ ఎమ్మార్ త్రిపురనేని రామస్వామి ప్రవచించే హేతువాద భావాలవద్ద ఆగకుండా కమ్యూనిజం వైపు వచ్చారు. కా॥ఘంటా సీతారామయ్య గారు కూడా అలా వచ్చిన వారే.

సిపిఎం నుండి విప్లవకారులు విడివడిన తర్వాత సాయుధ పోరాటం అంటే వర్గ శత్రుఖతం అనే పవనం బలంగా వీచింది. గొప్ప ప్రజాఉద్యమాలు నిర్మించిన వారు కూడా. దానిముందు తలవంచారు. సంతోష్‌రాణా-దేబ్రా-వల్లభపూర్ ఆదివాసీ ఉద్యమ నాయకుడు వర్గశత్రుఖతం మార్గంలోకి వెళ్ళారు. ఇలాంటి పంథాకు లోనుకాకుండా ప్రజాయుద్ధ పంథాలో సాగుతున్నాం. కామ్రేడ్ ఎమ్మార్ ఆ ప్రవంతిలో స్థిరంగా నిలిచారు.

కామ్రేడ్ ఎమ్మార్ ఇంకొల్లు వద్ద భీమవరంలో దళితులపై దాడి జరిగినపుడు వెనువెంటనే సమాచారం సేకరించుకొచ్చి 8 పేజీల కరపత్రం ముద్రించుకెళ్ళి గడపగడపకూ పంచారు. కమ్యూనిస్టు ఉద్యమ భూమికలోంచే ఆయన స్పందించారు.

కులసమస్య, అసమానతలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టుపార్టీ ప్రారంభంనుండి కృషిచేసింది. పాలకవర్గాలు కులవ్యవస్థను ఇంకా బిగించాయి. ఆనాడు కారంచేడులోనే దళితులకు స్థానం కల్పించాలని డిమాండ్‌చేసి ఆనాటి దళిత నాయకులతో తలపడ్డాడు. ఆనాటికి సాధ్యం కాలేదు. చుండూరు నాటికి గ్రామంలోనే వారి ఆవాసాల కోసం దళిత సంఘాలు డిమాండ్ చేయగలిగారు. ఈ అసమాన వ్యవస్థకు వ్యతిరేకంగా రాజీలేకుండా పోరుచేసిన కామ్రేడ్ ఎమ్మార్ స్ఫూర్తితో ముందుకు సాగుదామంటూ కా॥విజయకుమార్ సంస్మరణసభను ముగించారు.

సభలో ప్రజాకళాకారులు కా॥ఎమ్మార్‌పై, అరుణపతాకం గురించి, అమరులపై పాడిన పాటలు ఉత్తేజాన్ని నింపాయి. దాదాపు 1500 మంది ప్రజానీకం ఈ సంస్మరణ సభలో పాల్గొన్నారు ✡

# మా కామ్రేడ్ మానం రామారావుకు లాల్‌సలాం!

\- దేవి

**అమరుడా** రామారావు అందుకో మా లాల్‌సలాం
మానం రామారావుకు లాల్‌సలాం
మా క్రామ్రేడ్ యం.ఆర్. నీకు లాల్‌సలాం లాల్‌సలాం ॥అమరుడా॥

కమ్యూనిస్టు జీవితమే ధన్యమని ఎంచుకొని
తుదిశ్వాసున్నంతవరకు ఉద్యమ చింతనతోనే
అలుపెరుగని అలజడివై ప్రజల మధ్య నిలచిన ఓ ॥అమరుడా"

సంఘమే గురువుగా మన్నులో అ, ఆలు దిద్ది
యువజనుల, పాలేర్లను సంఘాలుగ కూడగట్టి
రాత్రి పాఠశాలతో రాజకీయ కృషి సల్పి
యువజనుల పంటదీసి ఉద్యమానికందించిన ॥అమరుడా॥

పాలేరుల ఓటు హక్కు, ఊరిచెరువు నీటికొరకు
ఛాందస మూఢత్వాలను అగ్రకులపు అణచివేతను
ఎదిరించి పెత్తందార్లకు సవాలువై నిలిచిన నువు
పీడితులకు దళితులకు అడుగడుగున అండవేను ॥అమరుడా॥

అక్రమ నిర్బంధాలు నిత్యం నిను వెంటాడిన
మరునిముషం మారువేషం స్మశానంలో సంచారం
ఖాకీల కన్నుగప్పి 'వసంత'గమనంతోనే
ఊరూరా తిరిగి నీవు పోరును రాజేసావు ॥అమరుడా॥

సామాజిక మార్పుకోరి మార్క్సిజాన్ని స్వీకరించి
విప్లవమే వృత్తిగా వున్నదంత ధారబోసి
నాగిరెడ్డి బాట నడచి నలుదిశల చాటిచెప్పి
నిబద్ధతకు నిలువెత్తు దర్పణమే నీవైతివి ॥అమరుడా॥

కొండమొదలు కాల్పులైన కొండమోడు పోరైనా
ఖాకీలా భూస్వాముల దాష్టీకం ఎక్కడైన
'స్టాలిన్ గ్రాడ్' వారసునిగ పోరు ప్రజల గొంతుకవై
జనవిప్లవ శంఖాన్నే పూరించిన నాయకుడా ॥అమరుడా॥

అతి, మిత వాదాలు రెండు ఉద్యమాని కడ్డంకులె
ప్రజాయుద్ధ పంథాయే ప్రజల కండ అన్నావు
అవకాశవాదంపై అడుగడుగున పోరుజేసి
కమ్యూనిస్టు కర్తవ్యం జనముక్తని చాటినావు ॥అమరుడా॥

బడుగుల పీడితులపైన విశ్వప్రేమ నీతత్వం
కరకు కమ్యూనిస్టు గుండె నిబ్బరమూ నీ సొంతం
మరువలేము నీ త్యాగం మరువబోము నీ గమ్యం
మన ప్రజలను నడిపిస్తాం ఈ దోపిడి కూలుస్తాం ॥మన ప్రజలను॥

# భూములు, ఇళ్ళస్థలాలకోసం కొనసాగుతున్న పిడుగురాళ్ళ పేదల పోరాటానికి కా॥ఎమ్మార్ పిలుపు

*గుంటూరుజిల్లా-పల్నాడు ప్రాంతంలో 1995నుండి కామ్రేడ్ విశ్వమోహనరెడ్డి నాయకత్వంలో ప్రజలు పెద్దఎత్తున కదలి పిడుగురాళ్ళ లెనిన్‌నగర్; కొండమోడు తరిమెల నాగిరెడ్డినగర్‌ల ఏర్పాటుతోపాటుగా వందలాది ఎకరాల బంజరు, ఫారెస్టు బంజరు, దేవాదాయ భూములను స్వాధీనం చేసుకొన్నారు. ఈ క్రమంలో భూస్వాములు, స్థానిక బడావ్యాపారులతో కుమ్మక్కైన ప్రభుత్వం ప్రజలపై తీవ్ర నిర్బంధాన్ని మోపింది, అరెస్టులు సాగించింది. కొండమోడులోని తరిమెల నాగిరెడ్డినగర్‌ను 97 ఫిబ్రవరిలో ఫారెస్టు, పోలీసు అధికారులు కలగలసి ప్రొక్లెయినర్‌తో కూల్చివేశారు.*

*ఈ నేపధ్యంలో అమరులు కా॥ఎన్.వి.కృష్ణయ్య, మండ్ల సుబ్బారెడ్డి; సీనియర్ నాయకులు కా॥ముత్తిరెడ్డి శ్రీరాములుతో కలసి పిడుగురాళ్ళలో 20-3-97న జరిగిన బహిరంగసభలో కా॥మానం రామారావు ఇలా ప్రసంగించారు:*

***- సంపాదకుడు***



**'గుంటూరుజిల్లాలో** వేల ఎకరాల బంజరు భూమి వుంది. పాత గుంటూరు జిల్లాలోని కొత్తపట్నం మొదలుకొని రేపల్లె వరకు వున్న కోస్తా ప్రాంతంలో చిట్టడివితో కూడిన (ఇక్కడ ప్రధానంగా పుల్లరేగు పళ్ళు, ఈత, అడవి కాకరకాయలు లాంటివి వుండేవి) సెంట్రల్ గవర్నమెంటు ఫారెస్టు వుంది. ఇందులో కొంతభాగం ఉప్పు పండించే చవిటి భూమి (సాల్ట్ బంజరు) వుంది.

ఈ కోస్తా ప్రాంతంలో వున్న బంజరులో బాపట్ల నుండి చినగంజాం వరకు వున్న 20వేల ఎకరాల రొంపేరు బంజరు ముఖ్యమైనది.

1952లో కృష్ణా బ్యారేజి కట్టినాక ఈ భూములకు విలువ పెరిగింది. ఆనాడు కమ్యూనిస్టు పార్టీ అసెంబ్లీలో బలమైన ప్రతిపక్షంగా వుంది. అసెంబ్లీ వెలుపల ప్రజాపోరాటం సాగుతుండటంతో 1955లో కర్నూలు అసెంబ్లీలో కమ్యూనిస్టు పార్టీ ప్రతిపాదించిన బంజరు బిల్లు ఒక్క ఓటు మెజారిటీతో పాసయ్యింది. ఈ బిల్లు ప్రకారం రాజకీయ బాధితులకు ఒక్కొక్కరికి మాగాణి అయితే 5 ఎకరాలు, మెట్టయితే 10 ఎకరాలు యివ్వాలని; పేదలకైతే మాగాణి 2 1/2 ఎకరాలు, మెట్టయితే 5 ఎకరాలు పంచాలని పేర్కొంది.

ఆనాడు కమ్యూనిస్టు పార్టీ-రైతు సంఘం, వ్యవసాయకూలీసంఘం యిచ్చిన పిలుపు మేరకు 1954 నుండి 1955 చివరి వరకూ రొంపేరు బంజరు భూముల పోరాటం సాగింది. ఈ పోరాటంలో చుట్టుప్రక్కల వున్న 18 గ్రామాల ప్రజలతోపాటు, ఈ బంజరుతో సంబంధంలేని నర్సాయపాలెం, పర్చూరు, నందిపాడు, జూపూడి వగైరా గ్రామాల ప్రజలు ఈ పోరాటానికి అండదండగా నిలబడ్డారు. జైళ్ళకు వెళ్ళారు.

బంజరు చట్టం అమలుకోసం మొత్తం 530 మంది ప్రజలు 3 నెలల 15 రోజులపాటు ఆలీపూర్, బళ్ళారి, రాజమండ్రి జైళ్ళలో శిక్షలు అనుభవించారు. (అందులో 50మంది స్త్రీలు వున్నారు. వీరిలో ముగ్గురు గర్భిణీ స్త్రీలు జైలులోనే ప్రసవించారు).

ఈ ఆందోళన ఫలితంగా ప్రభుత్వం స్పెషల్ కలెక్టర్‌ని నియమించింది. 1942లో యుద్ధకాలంలో బ్రిటీషు వాడు అధిక ఆహారోత్పత్తి చేయండంటూ ప్రభుత్వ భూమికి బి-ఫారాలు (ప్రభుత్వ భూమిని పర్మిషన్ లేకుండా ఆక్రమించుకున్నందుకు పెనాల్టీ వేయటం) యిచ్చాడు. ఈ బి-ఫారాల ఆధారంతో పూర్వంనుండి ఎంతోమంది పేద, మధ్యతరగతి ప్రజలు సాగుచేసుకుంటున్న భూమిని సర్వేచేసి, పట్టాలివ్వటంలో అవకతవకలకు పాల్పడకుండా చూసే బాధ్యతను రైతు సంఘం తాలూకా అధ్యక్షుడు యార్లగడ్డ అంకమ్మకి పార్టీ కేటాయించింది. 1955 చివరికి సర్వే పూర్తిచేసి పట్టాలివ్వటం జరిగింది.

1946 నుండి మద్రాసు అసెంబ్లీలో రెవిన్యూ మంత్రిగా వున్న కల్లూరి చంద్రమౌళి గణపవరంలో పడావుగా వున్న 360 ఎకరాల బంజరును తన తండ్రి సుదర్శన్ పేరుతో "సుదర్శన్ కాలనైజేషన్ సొసైటీ" నేర్పరచి 33 మందికి తలా 10 ఎకరాల చొప్పున రిజిస్టరు చేయించాడు. ఈ బంజరుకోసం కూడా ప్రజలు పోరాడి సాధించుకున్నారు.

కరవది నుండి ఉప్పుగుండూరు వరకు రైలు కట్టకు తూర్పుభాగానగల 1200 ఎకరాల బంజరును ఆనాటి రంగుల ఎగుమతి దారులలో ప్రముఖుడైన ద్రాక్షరపు చంద్రమౌళికి బ్రిటిషు పాలకులు 99 సం॥ల కౌలుకిచ్చారు. చుట్టుప్రక్కల గ్రామాల పేద, మధ్యతరగతి ప్రజలు ఈ కౌలు ఒప్పందానికి వ్యతిరేకంగా ఆందోళనచేసి కొంతభూమి సాధించు కున్నారు.

రొంపేరు బంజరు పోరాట కాలంలోనే అది అందించిన స్ఫూర్తితో కమ్యూనిస్టుపార్టీ నాయకత్వాన మూసీ, ఆలేరు, గుండ్లకమ్మ, నల్లమడ, వేటపాలెం డ్రైను బంజరు, కొల్లిమర డ్రైను బంజరు, ఎన్నో గ్రామాలలో డొంక పోరంబోకులు, రోడ్డు మార్జిన్ పోరంబోకులు, పెదనందిపాడు లావువారి చెరువు బంజరులాంటి ఎంతో బంజరును పేద, మధ్యతరగతి ప్రజలు ఎక్కడికక్కడే కదిలి ఆక్రమించు కున్నారు. ఈ క్రమంలోనే ఒక్క నర్సాయపాలెంలోనే 48 ఎకరాల భూమిని ఆక్రమించుకున్నారు.

జరుగుమల్లి, చింతలపాలెం పల్లెల పేద ప్రజలు సరిగతోటలు పెంచి సాగుచేసుకుంటున్న మూసీ ఒడ్డున వున్న 200 ఎకరాల భూమిని-ఎప్పుడో మంత్రి, భూస్వామి చెంచు రామానాయుడి తల్లి వీశెడు మిరపకాయలిచ్చి రాయించుకున్నదన్న సాకుతో-7,8 లారీల సరిగెతోట సరుకును భూస్వాములు, ప్రభుత్వం కుమ్మక్కై స్వాధీనం చేసుకున్నారు. దీనికి వ్యతిరేకంగా ఎమర్జన్సీ కాలంలో పోరాటం జరిగింది.

ప్రభుత్వ రికార్డుల్లో ఫారెస్టు అని వున్నప్పటికీ వినుకొండ తాలూకా గుండ్లకమ్మ నుండి సత్తెనపల్లి తాలూకా కృష్ణానది ఒడ్డువరకు చెట్టూ చేమలేని విశాలమైన ఫారెస్టు బంజరు భూమికి ఒకనాడు అంతగా విలువ వుండేది కాదు. 1955లో నాగార్జున సాగర్ ప్రాజెక్టు శంఖుస్థాపన జరగడంతో ఈ భూమికి విలువ పెరిగింది. స్థానిక రాజకీయ నాయకులు, పెత్తందార్లు, నోరుగల వారు, అధికార్లు; బయట ప్రాంతాలనుండి (రేపల్లె, బాపట్ల తదితర తాలూకాల నుండి) వచ్చినవారు ఆక్రమించుకొని కొన్నివందల సున్నపు మిల్లులు, మినీ సిమెంటు ఫ్యాక్టరీలు, జిన్నింగ్ మిల్లులు, రకరకాల వ్యాపారాలు సాగిస్తున్నారు. ఆ మిల్లుల్లో పనిచేసే వేలాది కార్మికులు అదే ఫారెస్టు బంజరు భూమిలో ఇళ్ళు వేసుకొని బ్రతుకుతున్నారు. కొండమోడు, పిడుగురాళ్ళ ప్రాంతాలలో టి.ఎన్. నగర్, లెనిన్ నగర్‌లను వేసుకున్నది పేదప్రజలే. ఇంకా ఎంతో భూమి పంపకం జరపకుండా మిగిలివుంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కోటి ఎకరాల ఫారెస్టు బంజరు భూమిని పంచుతానని ప్రకటించాడు. కానీ, ఆయన ప్రభుత్వము, పోలీసు యంత్రాంగమే ఈనాడు ఒకే సర్వే నంబర్‌లో వున్న టి.ఎన్.నగర్ పేదప్రజలు, దళితులు కష్టపడి బాగుచేసుకున్న భూమిని, కాలనీని వారికి కాకుండా చేయటానికి మిల్లు యజమాని హరిశ్చంద్రప్రసాద్ లాంటి అగ్రకుల పెత్తందార్లు, రౌడీలు, గూండాలతో కుమ్మక్కైంది. ఇక్కడ రైతుకూలీ సంఘం నాయకత్వాన కూడు, గుడ్డ కోసం చారెడు నేలని ఆక్రమించుకోవటాన్ని నేరంజేసి కామ్రేడ్ మరియమ్మ తదితర కార్యకర్తలను, నాయకులను అక్రమంగా అరెస్టు చేసింది. గూండాల దాడితో చెయ్యి విరిగివున్న కా॥మరియమ్మను అక్రమంగా 19 రోజులపాటు పోలీసు కస్టడీలో నిర్బంధించారు. ఆనాడు వల్లూరి పూర్ణచంద్రరావుని చంపించిన చెన్నుపాటి విద్యను ఒక్కపూట కూడా బెజవాడ జైల్లో పెట్టకుండా, అనారోగ్యం పేరుతో గుంటూరు హాస్పటలుకి తీసుకొచ్చి, వింజామరలతో సేవలు చేసిన చరిత్రను గుర్తుచేస్తూ దళిత, పేద స్త్రీ కా॥మరియమ్మను క్రూరంగా నిర్బంధించటాన్ని పేర్కొంటూ ఉన్నవారి కొక న్యాయం లేనివాడికొక న్యాయం అమలుజేస్తున్న పాలకుల నైజాన్ని కా॥మానం రామారావు తన ఉపన్యాసంలో ఎండగట్టారు. అరెస్టులు, నిర్బంధాలను తట్టుకుంటూ పట్టుదలతో ముందుకు సాగడమే పేద ప్రజల ముందున్న మార్గమంటూ ఆయన తన ఉపన్యాసం ముగించారు.

**(16-4-1997 'జనశక్తి' నుండి)**

# 'కమ్యూనిస్టు నిబద్ధత, క్రమశిక్షణలను కా॥ఎమ్మార్ జీవితాచరణ నుండి స్వీకరిద్దాం!'

## కామ్రేడ్ మానం రామారావు సంస్మరణ సభలో వక్తల ఉద్ఘాటన



కా॥ఎమ్మార్ చిత్రపటానికి పూలమాలవేసి జోహార్లుచెప్తున్న కా॥ముత్తిరెడ్డి శ్రీరాములు; సంస్మరణ సభలో ప్రసంగిస్తున్న జస్వంతరావు; వేదికపై ఇతర వక్తలు; సభకు హాజరైన ప్రజానీకం

**గుంటూరు, 1-4-13:**

గ్రామీణ పేదల పోరాటయోధుడు, సిపిఐ (ఎం.ఎల్) సీనియర్ నాయకులు కామ్రేడ్ మానం రామారావు సంస్మరణ సభ-స్థానిక వెంకటేశ్వర విజ్ఞానమందిరంలో 1-4-13 మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమైంది. సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్రకమిటి ఆధ్వర్యంలో జరిగిన ఈ సంస్మరణసభకు **పార్టీ రాష్ట్ర నాయకులు కా॥గుర్రం విజయకుమార్** అధ్యక్షత వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి-ముఖ్యంగా గుంటూరుజిల్లాలోని పలు ప్రాంతాలనుండి ప్రజలు పెద్దఎత్తున ఈ సభకు హాజరై, దివంగత నాయకునికి ఘన నివాళు లర్పించారు.

సంస్మరణ సభ ప్రారంభానికి ముందుగా, వేదికపై నుంచిన కామ్రేడ్ ఎమ్ఆర్ చిత్రపటానికి-పార్టీ సీనియర్‌నేత కామ్రేడ్ ముత్తిరెడ్డి శ్రీరాములు పూలమాలవేసి జోహార్లర్పించారు. ఆపై వరుసగా వక్తలుగా విచ్చేసిన వివిధ పార్టీల నాయకులు, ఏఐఎఫ్‌టియు(న్యూ), రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) మరియు ఇతర ప్రజాసంఘాల రాష్ట్రనేతలు, మేధావులు, ప్రజాస్వామికవాదులు-కామ్రేడ్ ఎమ్మార్ చిత్రపటంవద్ద పూలతో నివాళులర్పించారు.

కామ్రేడ్ ఎమ్మార్‌కు నివాళులర్పిస్తూ దాదాపు ఏడు దశాబ్దాల ఆయన కమ్యూనిస్టు రాజకీయ జీవితాన్ని, అందులోని విశిష్టతలను కామ్రేడ్ విజయకుమార్ పేర్కొన్నారు. అనంతరం కామ్రేడ్ ఎమ్మార్ మృతికి సంతాపంగా సభకు హాజరైన యావన్మంది ప్రజానీకం లేచి నిలబడి మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. 'కామ్రేడ్ ఎమ్మార్ అమర్ రహే' నినాదాలు సభలో ప్రతిధ్వనించాయి.

సంస్మరణ సభలో తొలుత **సిపిఐ(ఎం-ఎల్) కేంద్ర నాయకులు, 'జనశక్తి' పత్రిక సంపాదకులు డా॥పి.జస్వంతరావు** మాట్లాడుతూ, కా॥ఎమ్మార్ తన జీవిత కాలంలో కార్యకలాపాలు సాగించిన ప్రాంతాలన్నింటి నుంచీ ఈ సభకు ప్రజలు హాజరయ్యారని పేర్కొన్నారు. సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకమిటి తరపున విప్లవాంజలి ఘటించారు. ఎమ్మార్ సతీమణి వసంతమ్మగారికి, వారి కుటుంబ సభ్యులకు కేంద్రకమిటి తరపున ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఆయన తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ 'కామ్రేడ్ ఎమ్మార్ నర్సాయపాలెంలోని ఓ చిన్న రైతు కుటుంబంలో జన్మించారు. త్రిపురనేని రామస్వామి నాస్తిక బోధనలతో ప్రభావితులై కమ్యూనిస్టు ఉద్యమంవైపు ఆకర్షితులయ్యారు. అప్పటిదాకా వున్న సాంప్రదాయాలకు భిన్నంగా - కొంత రాజీగా- 1943లో ఆయన వివాహం జరిగింది. మరుసటి సంవత్సరానికి ప్రజల చైతన్యస్థాయి పెరిగి ఆ తర్వాతనుండి గ్రామంలో అనేక దండల వివాహాలు జరిగాయి.

వలసపాలన కాలంలో బాపట్లలో కలరావచ్చి అనేకమంది మరణిస్తే, 'కలరా' అంటే మహమ్మారిలా భావించే ఆ రోజులలో, శవాలను తొలగించటానికి, వ్యాధి ప్రబలకుండా చర్యలు చేపట్టటానికి పాలకులు ముందుకు రాలేదు. ఆ సమయంలో కమ్యూనిస్టు పార్టీ పూనుకొని గుంటూరు డాక్టర్ల సహాయంతో అనేకమంది యువకులు ముందుగా తాము ఇంజక్షన్లు తీసుకొని ఆ శవాలను తొలగించారు. అమరులు కామ్రేడ్స్ చివుకుల శేషశాస్త్రి, నరసింహం వంటి వారితో కలసి కామ్రేడ్ ఎమ్మార్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కామ్రేడ్ ఎమ్మార్ తనకు వారసత్వంగా సంక్రమించిన ఆస్తిని పార్టీకోసం, ప్రజలకోసం ఖర్చు చేసిన త్యాగధనుడు. ఎన్నో నిర్బంధాలను భరించారు; ఎదుర్కొన్నారు. కామ్రేడ్ ఎమ్మార్ వంటి సీనియర్ నాయకులజీవితం-ఆచరణలనుండి నేర్చుకోవలసింది ఎంతో వుంది. ముఖ్యంగా 'నేను' అనే అహంనుండి బయటపడకుండా ప్రజలమధ్య నిర్మాణాన్ని అభివృద్ధి చేయలేమనేది గమనించాలి.

నర్సాయపాలెం గ్రామం - స్టాలిన్ గ్రాడ్‌గా పేరుగాంచింది. కామ్రేడ్ ఎమ్మార్ యువజనులను, పాలేర్లను కూడగట్టి సంఘాలు పెట్టారు. దళితులు ఆత్మాభిమానంతో తలెత్తుకు తిరిగేందుకు, పెత్తందార్లకు వ్యతిరేకంగా సంఘటితంగా నిలబడేందుకు కృషిచేశారు.

1965-67లలో పౌరహక్కుల రక్షణకోసం గుంటూరుజిల్లా నాయకులతో కలసి పెద్దఎత్తున సభ నిర్వహించారు. సంజయ్‌గాంధీ గుంటూరువచ్చి గాంధీ పార్కులో బహిరంగసభ పెట్టిన సందర్భంగా ప్రభుత్వ దుర్మార్గాల్ని వెల్లడిచేస్తూ కరపత్రం రాయించి, ముద్రించి, పెద్దఎత్తున అక్కడే పంపిణీ చేయించారు.

పొగాకు, పత్తి, మురుగు నీటిపారుదలకు సంబంధించి సమగ్ర వాస్తవాలు, వివరాలు కేంద్రానికి పట్టుకొచ్చి, పట్టుబట్టి కరపత్రాలు రాయించి ఇంటింటికీ పంపిణీ చేశారు. ఆవిధంగా రాసిన అనేక కరపత్రాలు, పార్టీ రాష్ట్రకమిటి ప్రకటనలుగా వెలువడిన సందర్భాలూ వున్నాయి.

పొగాకు రైతాంగ సమస్యలపై 1983కు 3 సం॥ ముందునుండీ కా॥ఎమ్మార్ నాయకత్వంలో ఈ కృషి సాగుతూ వచ్చింది- 1983లో పొగాకు రైతాంగం పెద్దఎత్తున కదిలారు, పోలీసులు కాల్పులు సాగించి ముగ్గురిని బలిగొన్నారు. పొగాకు ప్లాట్ ఫారాలపై అన్యాయాలకు వ్యతిరేకంగా సాగించిన అనేక పోరాటాల ఫలితంగానే కనీసం రైతుకు అందే డబ్బు అయినా సమయానికి చేతికి అందడం సాధ్యమైంది. ఇలాంటి పోరాటాల అవసరం నేడెంతగానో వుంది.

ప్రజల జీవితంలోని ఏ చిన్న అంశాన్నీ వదలకుండా కా॥ఎమ్మార్ ఫోకస్ చేసేవారు. మురుగు నీటిపారుదల సమస్యపై కా॥ ఎమ్మార్ చాలా కృషిచేశారు.

శ్రీకాకుళం, కొండమొదలు ఉద్యమాలు తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొన్న సమయంలో కామ్రేడ్ ఎమ్మార్

(తరువాయి 6వ పేజీలో)

# సిపిఐ(ఎం.ఎల్) సీనియర్ నాయకులు, అలుపెరగని ఆందోళనకారుడు కా॥మానం రామారావుకు కడసారి వీడ్కోలు

**విజయవాడ, 17-3-13:**

**సిపిఐ(ఎం.ఎల్)** సీనియర్ నాయకులు, ఆందోళనకారుడు కామ్రేడ్ మానం రామారావు (93 సం॥లు) 16-3-13 రాత్రి 10.30గం॥కు విజయవాడలో మృతిచెందారు. ఆయన మరణవార్త తెలిసిన వెంటనే రాష్ట్రంలోని వివిధ జిల్లాలనుండి సిపిఐ(ఎం.ఎల్) శ్రేణులు, వివిధ కమ్యూనిస్టు, విప్లవ పార్టీల; ప్రజాసంఘాల నాయకులు, అనేకమంది ప్రగతిశీల వైద్యులు, మేధావులు, సన్నిహితులు, స్నేహితులు, బంధువులు, పెద్దసంఖ్యలో తరలివచ్చి అమరులైన కామ్రేడ్ ఎమ్మార్‌కు శ్రద్ధాంజలి ఘటించారు.

17-3-13 మధ్యాహ్నం 3 గంటలకు విజయవాడ-గిరిపురంలోని కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి భవన్‌వద్ద కామ్రేడ్ ఎమ్మార్ మృతదేహాన్ని వుంచి, అంతిమ నివాళులర్పించారు. ఈ సంతాప కార్యక్రమాన్ని సిపిఐ(ఎం.ఎల్) రాష్ట్రనాయకులు కా॥భార్గవశ్రీ నిర్వహించగా, తొలుత సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్రనాయకులు కా॥గుర్రం విజయకుమార్, ఎమ్మార్‌కు నివాళులర్పిస్తూ ప్రసంగించారు.

1942లో కమ్యూనిస్టు పార్టీలో ప్రవేశించిన కామ్రేడ్ మానం రామారావు 1964లో సిపిఎం పక్షాన, 1968లో విప్లవ కమ్యూనిస్టుల పక్షాన నిలిచారని తెలిపారు.

తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు వ్యవస్థాపక బాధ్యునిగా వున్నారని; కామ్రేడ్ టి.ఎన్.రచన 'తాకట్టులో భారతదేశం' పుస్తకాన్ని విస్తృతంగా వివిధ రాజకీయశ్రేణుల మధ్య ప్రచారంచేయటంలో విరామమెరుగక శ్రమించారని తెలిపారు.

గుంటూరుజిల్లా - బాపట్ల తాలూకా, నర్సాయపాలెం గ్రామంలో జన్మించిన కా॥ఎమ్మార్ కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా గ్రామపెత్తందార్లతో సంఘర్షణ పడుతూనే ప్రజల అండతో ప్రెసిడెంట్‌గా గెలిచారని; అగ్రకుల దురహంకార దాడులకు వ్యతిరేకంగా దళితులను కూడగట్టారన్నారు. కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి విప్లవ రాజకీయాలపట్ల, విప్లవ ప్రజాయుద్ధపంథా పట్ల ప్రగాఢ విశ్వాసంతో, నిర్మాణ క్రమశిక్షణతో, నిరంతర ఆందోళనకారుడిగా, నిబద్ధ కమ్యూనిస్టుగా తన ఏడు దశాబ్దాల కమ్యూనిస్టు రాజకీయ జీవితాన్ని కడవరకూ కొనసాగించిన కామ్రేడ్ ఎమ్మార్‌కు సిపిఐ(ఎం.ఎల్) విప్లవజోహార్లర్పిస్తోందన్నారు.



కామ్రేడ్ ఎమ్మార్ భౌతికకాయంవద్ద నివాళులర్పిస్తున్న సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్ర, జిల్లాల నాయకులు

అనంతరం పార్టీ సీనియర్ నాయకులు, వివిధ కమ్యూనిస్టు విప్లవ పార్టీల ప్రతినిధులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు, జిల్లాల నాయకులు కా॥ఎమ్మార్‌కు నివాళులర్పించారు. వీరిలో సిపిఐ(ఎం.ఎల్) రాష్ట్రనాయకులు కామ్రేడ్ సింహాద్రి ఝాన్సి, సిపిఐ(ఎం.ఎల్) గుంటూరుజిల్లా కార్యదర్శి, సీనియర్ నాయకులు కా॥ముత్తిరెడ్డి శ్రీరాములు, పి.జస్వంతరావు(జనశక్తి ఎడిటర్); బాబూరావు (సిపిఎం); సూర్యదేవర నాగేశ్వరరావు, జెల్లివిల్సన్ (సిపిఐ); ఈశ్వర్ (సిపిఐ - ఎంఎల్ - లిబరేషన్); కొల్లిపర వెంకటేశ్వరరావు (ఎం.ఎల్ కమిటి); డా॥కొల్లా రాజమోహన్(నల్లమడ బాధిత రైతాంగ కమిటి); చెరుకూరి సత్యనారాయణ(అడ్వకేట్); బి.సుబ్బారావు (ప్రజాతంత్ర మేధావుల వేదిక), కె.రమ (సిపిఐ-ఎం.ఎల్-ఎన్‌డి); కా॥వర్మ, యాకూబ్, నాగరాజు, లలిత, బి.సాంబశివరావు, రఘు, రమణయ్య, కోటేశ్వరరావు, రాంబాబు, వీరబాబు, నాగేశ్వరరావు, లక్ష్మారెడ్డి, కిషోర్‌బాబు (రైతుకూలీ సంఘం - ఆం.ప్ర); వై.సోని, డివిఎన్.స్వామి, ఎస్.సాయి, జె.సుబ్బారావు, పూర్ణచంద్రరావు (ఏఐఎఫ్‌టియు-న్యూ); రవిబాబు, దివికుమార్ (జనసాహితి); పరమేశ్వరరావు, జిలాని, పాండు, విజయసారధి (ఏపిటిఎఫ్); కె.ఏసు, వి.హనుమంత రావు(ఓపిడిఆర్); సి.విజయ(స్త్రీవిముక్తి సంఘటన); బి.గురవారెడ్డి(టిఎన్ మెమోరియల్ ట్రస్టు); ఎస్‌కె.బాషా(ఎన్‌వైయస్); సిపిఐ(ఎం.ఎల్) గుంటూరుజిల్లా నాయకులు కా॥దేవరశెట్టి వెంకటస్వామి; ఇంకా, మీసాల వెంకట్రావు, ధర్మారావు, నాగూరు, రాగి సుబ్బారావు మరియు వివిధ ప్రజాసంఘాల కార్యకర్తలు ప్రజానీకం, బంధుమిత్రులు కా॥మానం రామారావుకు కడసారి నివాళులర్పించారు.

అనంతరం 'కా॥మానం రామారావు అమర్‌రహే' నినాదాలతో కృష్ణలంక విద్యుత్తు శ్మశాన వాటిక వరకు కాలినడకన అంతిమయాత్ర జరిగింది. 'కా॥రామారావు ఆశయాన్ని తుదికంటా కొనసాగిస్తామనే నినాదాలనడుమ విద్యుత్తు శ్మశాన వాటికలో అంత్యక్రియలు జరిగాయి.

Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010